# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 28-12-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 111 పేజీలు:6 వెల: రూ.1/-


## విశిష్ట సంస్కృతే మన ప్రత్యేక గుర్తింపు

### -విద్యార్థులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్భోద

హైదరాబాద్ డిసెంబర్ ( ఎక్స్ప్రెస్ న్యూ స్); : ఏ రంగంలోనైనా ఆత్మసంతృప్తి చాలా ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. నగరంలోని నారాయణగూడ కేశవ్ మెమోరియల్‌ను మంగళవారం రాష్ట్రపతి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులతో పలు అంశాలపై ముచ్చటించారు. ఆ తర్వాత విద్యార్థులు లేవనెత్తిన పలు అంశాలపై స్పందించారు. పెరుగుతున్న యువ జనాభా భారత్‌కు మరింత సానుకూలమని అభిప్రాయపడ్డారు. మన విశిష్ట సంస్కృతే మన ప్రత్యేక గుర్తింపు అన్నారు. ఎంత ఎదిగినా మన మూలాలు, సంస్కృతిని మరవొద్దని విద్యార్థులకు సూచించారు. గ్రామమైనా, ఏజెన్సీ అయినా సొంత సంస్కృతిని చూసి గర్వపడాలని పిలుపునిచ్చారు. గ్రామం, ఏజెన్సీ నుంచి వచ్చామనే ఆత్మనూన్యతను రానీయొద్దని సూచించారు. మన దేశంలో ప్రతి ఊరికి గ్రామ దేవత రక్షణగా ఉ ందన్న రాష్ట్రపతి.. మహిళలు అన్ని రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. మన రాజ్యాంగం మహిళలకు అనేక అవకాశాలు కల్పించిందని, తల్లిదండ్రులు చిన్నతనం నుండే పిల్లలకు విలువల గురించి నేర్పించాలని కోరారు. అన్ని విషయాల్లో అమెరికాతో పోల్చుకోవద్దని, భారత్‌లో ఉన్న జనాభా అమెరికాలో లేదన్నారు. భారత్‌లో ఉన్నన్ని కులాలు, భాషలు, వైవిధ్యం అమెరికాలోని లేవని స్పష్టం చేశారు.

# రంగనాథస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు : మంత్రి తలసాని




హైదరాబాద్, డిసెంబర్ 27: కార్వాన్ నియోజకవర్గ పరిధిలోని జియాగూడాలో రంగనాథ స్వామి ఆలయం వద్ద వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను పకడ్బంధీగా చేయాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. మంగళవారం రంగనాథ స్వామి ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

తిరుమల, తిరుపతి దేవస్థానం తరువాత జియాగూడలోని రంగనాథ ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు అద్భుతంగా జరుగుతాయని అన్నారు. ఆలయానికి లక్షల సంఖ్యలో భక్తులు వైకుంఠ ద్వార దర్శనానికి వస్తారని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.జీహెచ్ఎంసీతో పాటు శాంతి భద్రతల విషయంలో రాజీపడకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అన్నారు. స్థానికులు కూడా అధికారులకు సహకరించి వేడుకలు విజయవంతంగా జరిగేందుకు సహకరించాలని అన్నారు.

# బాలికల విద్యకు స్వర్ణయుగంగా మారిన తెలంగాణ : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, డిసెంబర్ 27:ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో బాలికల విద్యకు తెలంగాణ రాష్ట్రం స్వర్ణయుగంగా మారిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. పీజీలో 72శాతం, డిగ్రీలో 52శాతం,గురుకులాలు,కేజీబీవీల్లో 69 శాతం మంది బాలికలు చేరడం అభినందనీయమని అన్నారు. బీఈడీ ఫస్టియర్‌లో 81 శాతం బాలికల అడ్మిషన్లతో, ఉన్నత విద్యలో బాలికల ఎన్‌రోల్ మెంట్ రేషియోలో జాతీయ సగటును మించి తెలంగాణ ఫలితాలను సాధిస్తున్నదని ఆమె వెల్లడించారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మెడికల్ కాలేజీల కేటాయింపులో తెలంగాణ పట్ల మూర్తి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నా, వైద్య విద్యలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని అన్నారు. కొత్త విద్యాసంస్థల ఏర్పాటు,మౌలిక వసతుల కల్పనతో, ఉన్నత విద్యలో బాలికలు పెద్ద ఎత్తున చేరుతుండటం గర్వకారణమని ఆమె తెలిపారు.

# ఏ రంగంలోనైనా ఆత్మసంతృప్తి చాలా ముఖ్యం : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



హైదరాబాద్, డిసెంబర్ 27: ఏ రంగంలోనైనా ఆత్మసంతృప్తి చాలా ముఖ్యమంత్రి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. నగరంలోని నారాయణగూడ కేశవ్ మెమోరియల్‌ను మంగళవారం రాష్ట్రపతి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులతో పలు అంశాలపై ముచ్చటించారు. ఆ తర్వాత విద్యార్థులు లేవనెత్తిన పలు అంశాలపై స్పందించారు. పెరుగుతున్న యువ జనాభా భారత్‌కు మరింత సానుకూలమని అభిప్రాయపడ్డారు. మన విశిష్ట సంస్కృతే మన ప్రత్యేక గుర్తింపు అన్నారు. ఎంత ఎదిగినా మన మూలాలు, సంస్కృతిని మరవొద్దని విద్యార్థులకు సూచించారు. గ్రామమైనా, ఏజెన్సీ అయినా సొంత సంస్కృతిని చూసి గర్వపడాలని పిలుపునిచ్చారు.

గ్రామం, ఏజెన్సీ నుంచి వచ్చామనే ఆత్మనూన్యతను రానీయొద్దని సూచించారు. మన దేశంలో ప్రతి ఊరికి గ్రామ దేవత రక్షణగా ఉ ందన్న రాష్ట్రపతి.. మహిళలు అన్ని రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. మన రాజ్యాంగం మహిళలకు అనేక అవకాశాలు కల్పించిందని, తల్లిదండ్రులు చిన్నతనం నుండే పిల్లలకు విలువల గురించి నేర్పించాలని కోరారు. అన్ని విషయాల్లో అమెరికాతో పోల్చుకోవద్దని, భారత్‌లో ఉన్న జనాభా అమెరికాలో లేదన్నారు. భారత్‌లో ఉన్నన్ని కులాలు, భాషలు, వైవిధ్యం అమెరికాలోని లేవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి సత్యవతిరాథోడ్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు రాష్ట్రపతి కేశవ్ మెమోరియల్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు.

# ప్రభుత్వ పాఠశాలకు ఎన్నారై రమేశ్ ఇసంపల్లి భూ విరాళం



హైదరాబాద్, డిసెంబర్ 27:రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా కార్పొరేట్ తరహాలో విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ మన ఊరు మన బడి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.

సర్కారు బడుల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమానికి లండన్‌కు చెందిన ఎన్నారై, బీఆర్ఎస్ నాయకుడు రమేశ్ బాబు ఇసంపల్లి ఆకర్షితులయ్యారు. మంత్రి కేటీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకొని తన సొంతూరు మంచిర్యాల పట్టణ కేంద్రంలోని హమాలీవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పక్కన ఉన్న తన 8 గుంటల విలువైన భూమిని స్కూల్‌కు విరాళంగా అందించారు.

ఈరోజు ప్రగతి భవన్‌లో టీఎస్ఎఫ్‌డీసీ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుర్మాచలంతో కలిసి దీనికి సంబంధించిన పత్రాలను మంత్రి కేటీఆర్‌కు అందజేశారు. విదేశాల్లో ఉంటూ తెలంగాణ గడ్డపై చూపిస్తున్న ప్రేమ పట్ల, ఇంతటి బృహత్తరమైన కార్యక్రమములో పాలు పంచుకున్నందుకు ఎన్నారై రమేశ్ బాబును మంత్రి కేటీఆర్ అభినందించారు.

ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మన ఊరు-మన బడి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఇటీవల లండన్‌లో పర్యటించిన కేటీఆర్ తెలంగాణ తల్లి రుణం తీర్చుకోవడానికి, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వంతో కలిసి రావాలని ఎన్నారైలకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. కేటీఆర్ పిలుపుతో స్ఫూర్తి పొంది తనవంతు సహకారం అందించానని తెలిపాడు. టీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు దూసుకెళ్తుందన్నారు.

# అమెరికాలో మంచు తుఫాన్ బీభత్సం..ఏపీకి చెందిన భార్యాభర్తలు మృతి

అమరావతి: డిసెంబర్ 27:అమెరికాలో మంచు తుఫాన్ బీభత్సం సృష్టిస్తుంది. మంచు తుఫాన్ ప్రభావంతో మరణాల సంఖ్య రోజురోజుకూ పెరిగి పోతుంది. న్యూజెర్సీలోని అరిజోనాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు దంపతులు మంచుతుఫాన్‌లో ప్రాణాలు కోల్పోయారు. గుంటూరు జిల్లా పాలపర్రుకు చెందిన ముద్దన నారాయణ , భార్య హరిత , ఇద్దరు పిల్లలతో కలిసి న్యూజెర్సీ నగరంలో నివాసముంటున్నారు.

విహార యాత్రకు బయలు దేరిన సమయంలో మంచు తుఫాన్ వీరిని కమ్మేసింది. వెంటనే సహాయక బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు. హరిత మృతదేహం లభ్యం కాగా నారాయణ ఆచూకీ కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. వీరిద్దరి పిల్లలు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

న్యూజెర్సీలో జరిగిన ఘటన వివరాలను ఏపీలోని మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యుల ఇంట విషాదం నెలకొని ఉ ంది.మృతదేహాలను స్వస్థలానికి చేర్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# శంషాబాద్ విమానాశ్రయాన్ని కమ్మేసిన పొగమంచు.. విమానాలు దారి మళ్లింపు

హైదరాబాద్, డిసెంబర్ 27: నగర శివారు ప్రాంతాల్లో భారీగా పొగమంచు పేరుకుపోయింది. శంషాబాద్ విమానాశ్రయాన్ని పొగమంచు కమ్మేసింది. దీంతో విమానరాకపోకలకు అంతరాయం కలిగింది. రాజీవ్‌గాంధీ విమానాశ్రయానికి వచ్చిన పలు విమానాలను దారి మళ్లించారు. ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం ముంబయి చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చింది. ల్యాండింగ్‌కు వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో తిరిగి చెన్నైకి మళ్లించారు.

# దేశవ్యాప్తంగా కోవిడ్ మాక్ డ్రిల్.. సంసిద్ధంగా గాంధీ హాస్పిటల్

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:కోవిడ్ కలవరం మళ్లీ మొదలైన నేపథ్యంలో.. ఇవాళ దేశవ్యాప్తంగా హాస్పిటళ్లలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నారు. ఒకవేళ కేసులు పెరిగితే అప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి హాస్పిటళ్లు అన్నీ ప్రిపేరవుతున్నాయి. ఢిల్లీలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్సూక్ మాండవీయ ఇవాళ మాక్ డ్రిల్‌ను పర్యవేక్షించారు. నగరంలోని సఫ్దార్‌జంగ్ హాస్పిటల్‌లో మంత్రి మాండవీయ పరిశీలించారు. ఇలాంటి డ్రిల్ చేపట్టడం వల్ల మనం ఎంత వరకు సంసిద్ధంగా ఉన్నామో తెలుస్తుందని, ఏవైనా లోపాలు ఉంటే వాటిని సరిచేసుకునే వీలవుతుందని మంత్రి మాండవీయ తెలిపారు.

హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌లోనూ ఇవాళ కోవిడ్ మాక్ డ్రిల్ నిర్వహించారు. కోవిడ్ పేషెంట్లు పెరిగితే అప్పుడు ఎలాంటి చికిత్సను అందించాలో హాస్పిటల్ సిబ్బంది సిద్ధం చేశారు. ఎంత వరకు ప్రిపేర్డై ఉన్నామో చెక్ చేసుకుంటున్నామని గాంధీ హాస్పిటల్ ఆఫీసర్ తెలిపారు. డ్రిల్‌లో భాగంగా కీలకమైన ఆరోగ్య సౌకర్యాల గురించి పరిశీలించనున్నారు. ఐసోలేషన్ బెడ్స్ ఎన్ని ఉన్నాయి, ఆక్సిజన్ సపోర్ట్ బెడ్స్, ఐసీయూ బెడ్స్, వెంటిలేటర్ సపోర్టెడ్ బెడ్స్ ఎన్ని ఉన్నాయో తెలుసుకోనున్నారు.

# నేటి నుంచే రైతుబంధు.. రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ

హైదరాబాద్, డిసెంబర్ 27:యాసంగి సీజన్‌లో రైతు బంధు నిధుల పంపిణీ బుధ వారం నుంచి ప్రారంభం కానుంది. ఈ పదో విడత రైతు బంధుతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 66లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. గతంలో కంటే ఈసారి ఏకంగా సుమారు లక్ష మంది వరకు కొత్త రైతుల పేర్లు రైతు బంధు పథకంలో వచ్చి చేరాయి.

ఈ ఏడాది డిసెంబర్ 20 తేదీ లోపు రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారు పెట్టుబడి సాయానికి అర్హులుగా ప్రభుత్వం పేర్కొంది. దీంతో ఆ కటాఫ్ తేదీ లోపున భూ క్రయ విక్రయాలు పూర్తి చేసుకుని రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన దరఖాస్తులు ప్రభుత్వానికి లక్ష దాకా చేరాయని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

రిజిస్ట్రేషన్ పూర్తయి ధరణి రికార్డుల్లో పేర్లు ఎంటర్ అయిన రైతులకు బేషరతుగా యాసంగి రైతు బంధు పథకాన్ని వర్తింపచేస్తున్నామని అధికారులు ప్రకటించారు.

ఈ ఏడాది జూన్ 23 నుంచి డిసెంబర్ 20వరకు భూ క్రయ, విక్రయాల్లో భాగంగా రిజిస్ట్రేషన్లు చేసుకున్న రైతుల వివరాలు ధరణి పోర్టల్ ద్వారా వ్యవసాశాఖ వెబ్‌సైట్‌లో అప్‌డేట్ అయ్యాయి. ఆ వివరాల ఆధారంగానే కొత్త వారికి రైతు బంధు పంపిణీ కానుంది. కొత్తగా రిజిస్ట్రేషన్లు పూర్తయినా వ్యవసాయాధికారుల వద్ద రైతు బంధు దరఖాస్తు చేసుకోని రైతులకు వచ్చే ఏడాది జనవరి 7 వరకు దరఖాస్తుకు అవకాశం కల్పించారు. కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు వారి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలను స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో అందజేయాల్సి ఉ ంటుంది.

ఇప్పటికే పేర్లు నమోదైన రైతులకు రైతు బంధు పంపిణీ పూర్తయిన తర్వాత కొత్త వారికి కూడా నిధులు జమ చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది యాసంగి రైతు బంధు పథకం కింద రూ.7600 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయనుంది. ఈ నెల 28 నుంచి రైతు పథకం కింద రైతులకు ఇచ్చే పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఏ జిల్లాలో ఎంత మంది రైతులకు రైతు బంధు నిధులను పంపిణీ చేయాలో? ఆ వివరాలను ఆర్థిక శాఖ ఇప్పటికే ఆయా జిల్లాల వ్యవసాయాధికారులకు పంపించింది. ఈ నెల 28న మొదటగా ఎకరంగా భూమి ఉన్న రైతుల ఖాతాల్లో రైతు బంధు నిధులు జమ కానున్నాయి.

# 300 కోట్ల విలువైన నార్కోటిక్స్ పట్టివేత

ద్వారకా, డిసెంబర్ 27: గుజరాత్ తీరంలో ఇండియన్ కోస్టు గార్డుకు చెందిన పోలీసులు .. అక్రమంగా భారత జలాల్లోకి ప్రవేశించిన పాకిస్థాన్ బోటును పట్టుకున్నారు. గుజరాత్ ఏటీఆఎస్ ఇంటెలిజెన్స్ ఇచ్చిన సమాచారం మేరకు ఈ అరెస్టు జరిగింది. పది మందితో ఉన్న పాక్ బోటును గుజరాత్ తీరంలో పట్టుకున్నారు. ఆ బోటులో ఆయుధాలను సరఫరా చేస్తున్నారు. ఇంకా సుమారు 40 కేజీల బరువు ఉన్న మాదకద్రవ్యాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆ నార్కోటిక్స్ విలువ మార్కెట్‌లో సుమారు 300 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# సీఎస్ సోమేశ్ కుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే వనమా.. భూ నిర్వాసితుల సమస్యకు పరిష్కారం

కొత్తగూడెండిసెంబర్ 27: కొత్తగూడెం నియోజకవర్గంలోని సింగరేణి భూ నిర్వాసితులు.. రాఖీ, వనమానగర్, మాయాబజార్, కిరోసిన్ బంక్ రైల్వే భూ నిర్వాసితుల సమస్యలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌తో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఇవ్వాల (మంగళవారం) చర్చించారు. హైదరాబాదులో ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ సోమేశ్ కుమార్ ని కలిసి కొత్తగూడెం నియోజకవర్గంలోని భూ నిర్వాసితుల ఇంటి స్థలాల సమస్యపై చర్చించారు. దీనిపై స్పందించిన సీఎస్ సోమేశ్ కుమార్ వెంటనే అఅఒం రజత్ కుమార్ సైనీకి భూ నిర్వాసితులకు స్థలాలు కేటాయించాలని ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే అందరికీ ఇంటి స్థలాలు కేటాయిస్తారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమా తెలిపారు.



## చరిత్రలో నేటినిజం



ధీమాన్య్వ ఉరుణ్ జైట్లీ
సామాన్యుల మధ్య నిలిచి సంఘమ్మునకున
ప్రామాణిక సేవల నిడి
ఆమను అందించి గానిప్పు నంచిత కోర్తిను!!

(డిసెంబర్ 28 : అరుణ్ జైట్లీ జయంతి..)

-రాధశ్రీ

సెల్:9494481210



నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

# శవాల దిబ్బగా చైనా.. ఏం జరుగుతోంది?



న్యూ డిల్లీ డిసెంబర్ 27 (ఎక్స్ప్రెస్ న్యూ స్); చైనా! మిన్ను విరిగి మీదపడుతున్నా.. అక్కడ ఏం జరుగుతోందనే మాత్రం అత్యంత రహస్యం. ఎవరో చెబితేనో.. ఎలాగో తెలిస్తేనో.. తప్ప.. ఇక్కడ జరుగుతున్న కార్యక్రమాలు.. కార్యకలాపాలు మాత్రం బయటి ప్రపంచానికి తెలియడం లేదు.తాజాగా కరోనా ప్రభంజనం.. ఇప్పుడు చైనా దేశాన్ని శవాల దిబ్బగా మార్చేసింది. ఇది నిజంగా నిజం!! పరిస్థితులు ఊహించిన దానికంటే మరింత దారుణంగా ఉన్నాయి. ఎక్కడ చూసినా గుట్టలుగా పేరుకుపోయిన శవాలే కనిపిస్తున్నాయి.అంతేకాదు.. శవఖననాలు దహనాల కోసం.. ఊళ్లకు ఊళ్లు పయనిస్తున్నారు. పక్క గ్రామాలకు తీసుకువెళ్తున్నారు. శ్మశానాల వద్ద ఎక్కడ చూసినా శవాలను మోసుకొస్తున్న వారితో క్యూలు దర్శనమిస్తున్నాయి. ఆస్పత్రుల్లో పడకలు లేక.. అంబులెన్స్‌లోనే రోజుల తరబడి చికిత్స చేయాల్సి వస్తోంది. చైనా రాజధాని ప్రాంతం బీజింగ్‌తో సహా ఎక్కడ చూసినా ఆత్మీయులను పోగొట్టుకున్న వారి రోదనలు ప్రతిధ్వనిస్తున్నాయి. అంతా దాపరికమే!

కాగా చైనా మళ్లీ తన కుట్ర పూరిత బుద్ధిని బయట పెడుతూనే ఉంది. సొంత దేశంలో సమాచారాన్ని కూడా సొంత ప్రజలకు చేరవేయడం లేదు. ఎవరు చనిపోయారు? ఎందుకు చనిపోయారు? వంటి అంశాలను చైనా కప్పిపుచ్చేందుకు ప్రయత్నిస్తోంది. చైనా ఆరోగ్య కమిషన్ నుంచి లీక్ అయిన రహస్య సమాచారం ప్రకారం ఇప్పటికే 25 కోట్ల మంది వైరస్కు సోకినట్లు ప్రపంచానికి తెలుస్తోంది.ఎక్కడబడితే అక్కడే వైద్యం!కొత్తగా కరోనా సోకిన వారికి బెడ్లు లేకపోవడంతో అంబులెన్సులు ఆస్పత్రుల ప్రాంగణాల్లోనే.. చికిత్స అందిస్తున్నారు. ఏ ఆస్పత్రిలో అయినా బెడ్ దొరక్కపోదా అని ఆశతో రోగుల బంధువులు వందల కిలోమీటర్లు తిరుగుతున్నారు. బాధితులను వీల్ చైర్లలో కూర్చోబెట్టి చికిత్స అందించాలంటూ ఆస్పత్రి వర్గాలను వేడుకుంటున్నారు. హెబెయ్ ప్రావిన్స్‌లోని జువార్ఝౌలో పరిస్థితులు మరింత దారుణంగా ఉన్నాయి. ఆస్పత్రుల్లో ఆక్సిజన్ సరిపడక అత్యవసర చికిత్సకు వైద్యులు చేతులెత్తేస్తున్నారు. అహోరాత్రులూ.. శవ దహనాలే!చైనాలోని చాలా ప్రాంతాల్లో శ్మశాన వాటికల్లో అహోరాత్రులూ శవాలు తగలబడుతూనే ఉన్నాయి. దహనం చేసేందుకు శవాలతో బంధువులు రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. బీజింగ్ హెబెయ్ సహా దాదాపు చైనా అంతా ఇదే పరిస్థితి నెలకొంది. బీజింగ్ లో శ్మశాన వాటికలు చాలక గంటల తరబడి ప్రయాణించి ఇతర చోట్లకు చేరుకుంటున్నారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు వందల మీటర్ల మేర క్యూలు కట్టిన దయనీయమైన దృశ్యాలను ఓ చైనా ఆరోగ్యాధికారి సామాజిక మాధ్యమాల్లో ఉంచారు.

# బియఫ్-7 విజృంభణతో గజగజ వణుకుతున్న చైనా

డిసెంబర్-2019 మాసంలో చైనా దేశపు వూహాన్ నగరంలో రాజుకున్న కరోనా విపత్తు మంటలు ప్రపంచ దేశాలను చుట్టుముట్టి లక్షల ప్రాణాలను తీయడం, కోట్ల రోగులు ఆసుపత్రుల పాలుచేయడం లాంటి భయానక అనుభవాలను ఇప్పుడిప్పుడే మరిచిపోతూ సాధారణ జనజీవనంలో మునిగి పోతున్న జనుల గుండెల్లో బియఫ్-7 వేరియంట్ చైనాను కబళిస్తోందనే వార్తలు ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి. మాస్కులను మరిచిన జనం తిరిగి ముక్కులకు మాస్కులు వేసుకునే కల్లోల రోజులు వస్తున్నాయి. నేడు చైనాలో విజృంభిస్తున్న 4వ వేవ్ గుప్పిట్లో కోట్ల చైనా ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవితాలు గడపడం, ఆసుపత్రుల్లో ఖాళీలు లేకపోవడం, కరోనా పరీక్ష కేంద్రాలను మూసివేసి ఎవరికి వారే టెస్ట్ కిట్లతో నిర్ధారణ పరీక్షలు చేసుకోవడం, పాజిటివ్ అని తేలితే ఎవరికి వారే నియంత్రణ/ఔషధాలు వాడాలంటూ చైనా ప్రభుత్వం చేతులు ఎత్తేసే దుస్థితి రావడం ప్రపంచ మానవాళిని బెంబేలెత్తిస్తున్నది. వైద్యుల అంచనా ప్రకారం గత కొన్ని రోజుల్లో 10 కోట్ల వరకు ప్రజలు కరోనా బారిన పడినారని, 50 లక్షలు ఆసుపత్రుల్లో చేరారని, 10 లక్షల చైనీయులు మరణించడం జరిగిందని తెలుస్తున్నది. ఆసియా రేడియో వివరాల ప్రకారం గత 20 రోజుల్లో 25 కోట్ల ప్రజలకు కరోనా సోకినట్లు, చైనాలో నేడు 17 శాతం ప్రజలు వైరస్ బారిన పడినట్లుగా తెలుస్తున్నది. ఈ వారంలో ఒక్క రోజులోనే 3.7 కోట్ల చైనీయులకు కరోనా సోకినట్లు వింటున్నాం.

## బియఫ్-7తో ఇండియా సేఫ్ - చైనా డేంజర్ బెల్స్:

కరోనా ఫస్ట్, సెకండ్ వేవ్‌లో ప్రమాదకర డెల్టా వేరియంట్ విజృంభించడం, ప్రభావం తక్కువగా ఉన్న ఓమిక్రాన్ వేరియంట్ రూపంలో 3వ వేవ్ వ్యాపించడం చూసాం. నేడు చైనాలో బియఫ్-7 అనబడే ఓమిక్రాన్ సబ్-వేరియంట్ వేగంగా వ్యాప్తి చెందడంతో ప్రజలు దేవునిపై భారాన్ని మోపి, మందుల కొరత, ఆసుపత్రి వసతులు లేకుండా ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని పరుగు తీయడం హృదయవిదారకంగా ఉన్నది. బియఫ్-7 వేరియంట్ విజృంభించడంతో చైనా, జపాన్, సౌథ్ కొరియా, సింగపూర్, థాయిలాండ్ అనబడే 5 దేశాల అంతర్జాతీయ యాత్రికులు ఆర్‌టిపిసిఆర్ పరీక్షలు విధిగా చేయించుకొని రావాలని తగు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్న భారత ప్రభుత్వం తమ దేశ ప్రజలు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. నేడు విస్తరిస్తున్న బియఫ్-7 వేరియంట్ అంత ప్రమాదకరమైనది కాదని, భారత్‌లో రెండు డోసుల టీకాలు దాదాపు అందరికీ అందిన కారణంగా 'హెర్డ్ ఇమ్యూనిటీ అభివృద్ధి' చెందిందని, వయోవృద్ధులకు బూస్టర్ డోసులు కూడా అందాయని, అయినప్పటికీ ముందు జాగ్రత్తగా అందరు కరోనా నిబంధనలు స్వచ్ఛందంగా పాటించాలని సిసియంబి శాస్త్రజ్ఞులు కోరుతున్నారు. చైనాలో కరోనా టీకా డోసులు పూర్తిగా అందలేదని, చైనా రూపొందించిన టీకాల (సినోవాక్/సినోఫార్మా) క్రియాశీలత తక్కువగా (ఎఫికసీ 60 శాతం వరకు మాత్రమే) ఉందనే మాటలు వింటున్నాం. చైనా ప్రభుత్వ 'జీరో కోవిడ్ పాలసీ' లాక్‌డౌన్‌తో ప్రజలు బయటకు రాకపోవడంతో హెర్డ్ ఇమ్యూనిటీ అభివృద్ధి జరగలేదని, ప్రజల తిరుగుబాటుతో లాక్‌డౌన్ సడలించిన ప్రభుత్వం చేతులు ఎత్తేయడంతో చైనీయుల కోవిడ్-19 విపత్తు హాహాకారాలు వింటున్నాం. నేడు భారత ప్రభుత్వం టీకాలను, వైద్యానికి ఆసుపత్రులను, కోవిడ్-19 పరీక్షా కేంద్రాలను సర్వం సిద్ధంగా ఉంచడం శుభపరిణామం. ఇప్పటికే భారతంలో నాలుగు బియఫ్-7 కేసులు నిర్ధారణ అయ్యాయని, వారికి తగు వైద్యం అందుతున్నదని తెలుస్తున్నది. జనవరి-2022లో ఓమిక్రాన్ వేరియంట్ వ్యాప్తితో భారత్‌లో ఎక్కువ జనాభా కరోనా బారిన పడి నయం కావడంతో సహజ రోగనిరోధకశక్తి పెరిగిందని వివరిస్తున్నారు. భారతంలో 220 కోట్ల టీకా డోసులు వినియోగించడంతో 98 శాతం వయోజనులకు కనీసం ఒక డోసు, 90 శాతం రెండు డోసుల టీకాలు అందడంతో పెద్ద ప్రాణ నష్టం నమోదు కాలేదు.

## బియఫ్-7 వేరియంట్ రోగ లక్షణాలు:

ఓమిక్రాన్ గ్రూప్ సబ్-వేరియంట్ల లక్షణాల తరహాలోనే బియఫ్-7 వేరియంట్ సోకిన రోగుల్లో జ్వరం, వాంతులు, ఛాతి నొప్పులు, డయేరియా, దగ్గు, వణుకు, వాసన కోల్పోవడం, ఒకళ్లు నొప్పులు, గొంతు నొప్పి లాంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. ఈ లక్షణాలన్నీ ఒక్క వ్యక్తిలో కనిపించక పోవచ్చని, కొందరిలో కొన్ని లక్షణాలు బయట పడవచ్చని నిపుణులు అంటున్నారు. ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపించగల బియఫ్-7 వేరియంట్ ఒక వ్యక్తి ద్వారా 18 మందికి (ఆర్ ఫ్యాక్టర్ 10-18.6) వేగంగా వ్యాప్తి చెందవచ్చని గమనించారు. తీవ్ర అనారోగ్య సమస్యలు, బలహీన వ్యాధినిరోధకశక్తి, బిపి, డయాబెటిస్, ఒబేసిటీ, శ్వాసకోశ సమస్యలు, వృద్ధులు, గర్భిణులు, గుండె జబ్బులు లాంటి అనారోగ్యాలు కలిగిన ప్రజలకు బియఫ్-7 ప్రమాదకరంగా మారవచ్చని తెలుపుతున్నారు. టీకాలు వేయించుకున్న వారికి, టీకాతో వచ్చే ఇమ్యూనిటీని అధిగమించి కూడా బియఫ్-7 వేరియంట్ వ్యాపించవచ్చని హెచ్చరిస్తున్నారు.

## బియఫ్-7తో భయం వద్దు - అప్రమత్తతే ముద్దు:

టీకా డోసులు పూర్తిగా తీసుకోని ప్రజలు వెంటనే తీసుకోవాలని, మానసికంగా ధైర్యంగా ఉండాలని, అర్హులు బూస్టర్ డోసులు వేయించుకోవాలని, రోగ లక్షణాలు కనిపించిన వారు కరోనా పరీక్షలు చేయించుకోవాలని, మాస్కులు వాడాలని, వ్యక్తులను/వస్తువులను తాకిన వారు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని, వీలున్నంత వరకు భౌతిక దూరాలు పాటించాలని కోరుతున్నారు. రాబోయే రోజుల్లో వివిధ వేరియంట్లు/సబ్-వేరియంట్లతో కరోనా విపత్తు కల్లోలం జరుగవచ్చని, ప్రతి ఒక్కరు వెంటనే బూస్టర్ డోసులు తీసుకోవాలని, కరోనా నిబంధనలు విధిగా పాటించాలని కోరుతున్నారు. చికిత్స కన్న నివారణే మిన్నయని మరువకుండా చేతులు కాలకముందే ఆకులు సిద్ధం చేసుకుందాం. ం



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ఉక్రెయిన్ అధ్యక్షుడు మాననీయ వోలోడిమిర్జెలెన్స్కీతో ప్రధానమంత్రి ఫోన్ సంభాషణ

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ ఉక్రెయిన్ అధ్యక్షుడు మాననీయ వోలోడిమిర్ జెలెన్స్కీతో ఫోన్లో సంభాషించారు. ఈ సందర్భంగా జి20కి భారత్ అధ్యక్షతపై ఉక్రెయిన్ అధ్యక్షుడు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానమంత్రి స్పందిస్తూ- జి20కి అధ్యక్షత సమయంలో భారత్ ప్రాధాన్యాల గురించి వివరించారు. ఇందులో భాగంగా ఆహార, ఇంధన భద్రత వంటి అంశాల్లో వర్ధమాన దేశాల గళానికి ప్రాముఖ్యం ఇస్తామని ఆయన తెలిపారు. ద్వైపాక్షిక సహకారం బలోపేతానికిగల అవకాశాలై దేశాధినేతలిద్దరూ చర్చించారు. ఈ ఏడాది ఆరంభంలో ఉక్రెయిన్ నుంచి స్వదేశం వచ్చిన భారత విద్యార్థుల చదువు కొనసాగింపునకు ఏర్పాటు చేయాల్సిందిగా ప్రధానమంత్రి ఉక్రెయిన్ అధికారవర్గాలను కోరారు.

ఉక్రెయిన్‌లో ప్రస్తుత ఘర్షణకు సంబంధించి వారిద్దరూ తమ అభిప్రాయాలను పంచుకున్నారు. శత్రుత్వాలను తక్షణం విడనాడాలన్న తన పిలుపును ప్రధాని మోదీ గట్టిగా పునరుద్ఘాటించారు. అలాగే విభేదాలకు శాశ్వత పరిష్కారం అన్వేషించే దిశగా ఉభయ పక్షాలు మళ్లీ చర్చలు, దౌత్య మార్గం అనుసరించాలని కోరారు. ఏదేమైనప్పటికీ శాంతి ప్రయత్నాలకు భారత్ సదా మద్దతిస్తుందని కూడా ప్రధాని స్పష్టం చేశారు. బాధిత ఉక్రెయిన్ పౌరులకు మానవతా సహాయం కొనసాగించడంలో భారత్ నిబద్ధతకు హామీ ఇచ్చారు.

# కిలిమంజారో పై త్రివర్ణ పతాకం.. వివేక్‌ను అభినందించిన హనుమకొండ కలెక్టర్

హనుమకొండ, డిసెంబర్ 27: ములుగు జిల్లా మంగపేట మండల వాస్తవ్యుడైన గిరిజన యువకుడు వాసం వివేక్ కుమార్ ఆగస్టు 15న ఆఫ్రికాలోని అత్యంత ఎత్తయిన శిఖరం (5,895మీ.) కిలిమంజారోను అధిరోహించాడు. శిఖరాగ్రంపై త్రివర్ణ పతాకాన్ని ఎగరవేసి రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచ నలుమూలలా చాటాడు. మంగళవారం సామాజికవేత్త ఈవి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుని కలిశారు. అదే విధంగా 2024లో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడానికి ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వాసం వివేక్ ను శాలువాతో సత్కరించి అభినందించి నా సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు.






# హైదరాబాద్‌లో సుమారు రూ.50 కోట్ల విలువైన 25 కిలోల మెఫెడ్రోన్‌ను స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ



న్యూఢిల్లీ, డిసెంబర్ 27:హైదరాబాద్ లో రహస్యంగా మెఫెడ్రోన్ తయారు చేస్తున్న రెండు కేంద్రాలపై డైరెక్టరేట్ ఆఫ్ ఇంటెలిజెన్స్ రెవెన్యూ (డీఆర్ఐ) అధికారులు దాడులు నిర్వహించారు. మరియు సూత్రధారి మరియు ఫైనాన్సియర్ ని అరెస్ట్ చేసిన డీఆర్ఐ అధికారులు మెఫెడ్రోన్ అక్రమ తయారీ వ్యవస్థను భగ్నం చేశారు. డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్న మెఫెడ్రోన్ గ్రే మార్కెట్ విలువ 49.77 కోట్ల రూపాయల వరకు ఉంటుంది. 24.885 కిలోల మెఫెడ్రోన్ ను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనితో పాటు తయారీకి సిద్ధంగా ఉన్న పదార్థాలు, నగదును కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నగదు, ముడి పదార్థాల విలువ 18.90 లక్షల రూపాయల వరకు ఉంటుంది.

నిర్దిష్ట ఇంటెలిజెన్స్ ఆధారంగా రంగంలోకి దిగిన డీఆర్ఐ అధికారులు 2022 డిసెంబర్ 21న సమన్వయంతో ఆపరేషన్ ప్రారంభించారు. రెండు ప్రయోగశాలలు అక్రమంగా మెఫెడ్రోన్ తయారు చేసినట్లు అధికారులు గుర్తించి దాడులు చేశారు. ఈ రెండు ప్రాంతాల్లో మెఫెడ్రోన్ తయారు చేస్తున్న ఏడుగురిని అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.

విచారణ కొనసాగించిన అధికారులు అక్రమ తయారీ సూత్రధారి, నిధులు సమకూర్చిన వ్యక్తిని గోరఖ్ వద్ద అరెస్టు చేశారు. నేపాల్ కు పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా సూత్రధారిని ఆరెస్ట్ చేసిన అధికారులు అతని నుంచి 60 లక్షల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు.

2016లో ఇండోర్ లో 236 కిలోల ఎఫిడ్రిన్, యమునా నగర్ లో 667 కిలోల మెఫెడ్రోన్ను రహస్యంగా తయారు చేస్తున్నారన్న ఆరోపణతో డీఆర్ఐ అరెస్ట్ చేసిన కొందరు నిందితులు హైదరాబాద్ లో డీఆర్ఐ అరెస్ట్ చేసిన వారిలో ఉన్నారు. ఇండోర్ లోని జైలు నుంచి తప్పించుకున్న కేసు, హైదరాబాద్ లో ఓ హత్య కేసు, వడోదరలో జరిగిన దొంగతనాల కేసులో కూడా వీరికి సంబంధం ఉంది.

మాదకద్రవ్యాల కేసులో ప్రధాన సూత్రధారులు మరియు నేరస్థులు / నిధులు సమకూరుస్తున్న వారిని పట్టుకోవడంపై దృష్టి సారించాలని హోం మంత్రి మరియు ఆర్థిక మంత్రి అధికారులకు ఇచ్చిన సూచనలకు అనుగుణంగా ప్రధాన వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకోవడానికి డీఆర్ఐ ప్రత్యేక చర్యలు ప్రారంభించింది.

తయారీ కేంద్రాలను నిర్వీర్యం చేసి మొత్తం డ్రగ్ సిండికేట్ ను అరెస్ట్ చేసిన డీఆర్ఐ అధికారులు నూతన సంవత్సరం, ఆ తర్వాత మాదకద్రవ్యాల సరఫరా చేయడానికి జరిగిన కుట్రను భగ్నం చేశారు.

పస్తుత ఆర్థిక సంవత్సరంలో 2022 జూలై-ఆగస్టు లో హర్యానాలోని యమునా నగర్ లో డీఆర్ఐ ఛేదించిన అతి పెద్ద కేసు తర్వాత హైదరాబాద్ కేసు రెండవది. ఈ ఆర్థిక సంవత్సరంలో (2022 నవంబర్ వరకు) 990 కిలోల హెరాయిన్, 88 కిలోల కొకైన్, 10,000 మెథాంఫేటమిన్ మాత్రలు, 2,400 లీటర్ల ఫెన్సెడైల్ దగ్గు సిరప్, ఇతర హానికరమైన ఎన్డిపిఎస్ పదార్థాలను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దేశ ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి మరియు నార్కో టెర్రరిజం సవాలును ఎదుర్కోవటానికి డీఆర్ఐ కట్టుబడి ఉంది

# ఏ ఒక్కరికి పెన్షన్ తొలగించేది లేదు : మేయర్ శిరీష




తిరుపతి, డిసెంబర్ 27:ఏ ఒక్కరికి పెన్షన్ తొలగించేది లేదని కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ శిరీష మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అర్హులైన వారికి అందేలా చేస్తున్నారని వివరించారు. సీఎం బాటలోనే ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి అర్హులైన వారికి అందరికీ సంక్షేమ పథకాలు వారి ఇంటి వద్దకే అందేలా చేస్తున్నారని తెలియజేశారు. నగరంలో 102 సచివాలయం పరిధిలో ఆరు నెలలకు ఒక్కసారి. రీ వెరిఫికేషన్ పేరుతో పెన్షన్ విచారించడం జరుగుతున్నదని వివరించారు. దీనిపై ఎటువంటి అపోహలు చావు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందించడం జరుగుతుందని తెలిపారు. అలాగే 90 రోజులకు కొత్త పెన్షన్లతోపాటు ఇళ్ల పట్టాలు అందేలా ముఖ్యమంత్రి చర్యలు చేపట్టడం జరుగుతున్నదన్నారు. ఈనెల ఒకటో తేదీన అదనంగా 700 కొత్త పెన్షన్లు కూడా అందజేయడం జరుగుతున్నది అన్నారు. ఒకవేళ కరెంటు బిల్లు, ఇంటి పన్ను ఏదైనా తేడా ఉంటే వాటిని కూడా అధికారులు పంపించి వాటిని విచారించి సరి చేయడం జరుగుతున్నది అన్నారు. అనంతరం డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో అర్హులైన వారు పెన్షన్ తీసుకుంటూ చనిపోతే ఆ తర్వాత అర్హులైన వారిని గుర్తించి పెన్షన్ ఇచ్చే వారిని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి వారి ఇంటి వద్దకే వచ్చి టెన్షన్ ఇస్తున్నారని తెలియజేశారు. పెన్షన్ దారులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయా కార్పొరేషన్ పరిధిలో కార్పొరేటర్లు అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందించడం జరుగుతుందని ఎటువంటి ఆందోళన చెందవద్దని తెలియజేశారు. ఈ విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు. శేఖర్ రెడ్డి. లడ్డు భాస్కర్ రెడ్డి. ఆదం రాధారెడ్డి. ముని రావిరెడ్డి.ఎస్ . కే .బాబు. హనుమంతు నాయక్. ఆంజనేయులు. నరేంద్ర. ఈశ్వరి. కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ట్రినిటీ విద్యార్థులు

కరీంనగర్, డిసెంబర్ 27: ఎద్దపల్లి పట్టణంలోని ట్రినిటీ హై స్కూల్ లో చదువుతున్న 7 వ తరగతి విద్యార్థి పి.అక్షిత ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో పాల్గొని జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. జార్ఖండ్ లో ఈ నెల 28 నుంచి 30 వరకు జరిగే జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రినిటీ విద్యా సంస్థల్లో చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యతను ఇస్తామని, విద్యార్థులు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రణధీర్, పిఈటిలు షఫీ, కిషోర్, భూపతి, వెంకటేష్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఏపీలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : ప్రభుత్వ విప్ బాల్క సుమన్



అమరావతి: డిసెంబర్ 27:ఏపీలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఏపీ నాయకులకు చెన్నూరు ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఌ మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బాల్క సుమన్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ లోని బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయడానికి తూర్పు గోదావరి జిల్లాలోని 19 అసెంబ్లీ నియోజకవర్గాలకు నాయకత్వం వహించే నాయకులు ఈరోజు హైదరాబాద్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ ను కలిశారు. రాబోవు రోజుల్లో పార్టీ అనుసరించే విషయలు చర్చించారు. ఏపీలో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఇందుకు కావాల్సి సహాయ కహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. గ్రౌండ్ లెవల్ నుంచి పార్టీ బలోపేతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షులు మేడిపల్లి సంపత్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బండారు సూరిబా పాల్గొన్నారు.

# సెస్ చైర్మన్‌గా చిక్కాల రామారావు, వైస్ చైర్మన్‌గా దేవరకొండ తిరుపతి

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 27: (నేటినిజం ప్రతినిధి): సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సొసైటీ(సెస్) చైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి చిక్కాల రామారావు(తంగళ్లపల్లి), వైస్ చైర్మన్‌గా దేవరకొండ తిరుపతి(కోనరావుపేట) ఎన్నికయ్యారు. ఈ మేరకు సెస్ ఎన్నికల అధికారి బీ మమత ప్రకటించారు. సెస్ చరిత్రలో మొదటిసారి బీఆర్ఎస్ పార్టీ విశ్వబ్రాహ్మణులకు వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించింది. నిన్న వెల్లడైన సెస్ ఎన్నికల ఫలితాల్లో 15 స్థానాల్లోనూ బీఆర్ఎస్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఒక్క స్థానాన్ని కూడా భారతీయ జనతా పార్టీ గెలుచుకోలేకపోయింది.

చిక్కాల రామారావు 1963, మార్చి 5వ తేదీన తంగళ్లపల్లి మండలం కట్కూర్‌లో జన్మించారు. ఆయన భార్య రిటైర్డ్ ఎంపీడీవో. కుమారుడు అశ్విన్ వ్యాపారం చేస్తుండగా, కూతురు హరిణి యూఎస్ఏలో ఉన్నారు. రామారావు డిగ్రీ వరకు చదువుకున్నారు.

1995లో కట్కూర్ సింగిల్ విండో చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 2007లో సిరిసిల్ల రూరల్ సెస్ డైరెక్టర్‌గా ఎన్నిక.. ఆ తర్వాత చైర్మన్ గా ఎన్నికై నాలుగేండ్లు పనిచేశారు. 2022లో తంగళ్ళపల్లి సెస్ డైరెక్టర్‌గా ఎన్నిక.. రెండో సారి సెస్ చైర్మన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2018 లో వెలమ సంక్షేమ మండలి జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. 2021లో రెండో సారి వెలమ సంక్షేమ మండలి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2001 నుంచి కేసీఆర్ వెంటే ఉన్నారు.మంత్రి కేటీఆర్ సిరిసిల్లకు రావడంలో కీలక పాత్ర పోషించారు. ఉద్యమంలో ముందుంటు, పార్టీకి వెన్నంటి ఉన్నారు. మంత్రి కేటీఆర్‌కు విధేయుడిగా ఉన్నారు.

దేవరకొండ తిరుపతి నేపథ్యం ఇది..

దేవరకొండ తిరుపతి కోనరావుపేట గ్రామంలో జన్మించారు. భార్య రాణి గృహిణి కాగా, కుమారులు సృజన్, శశాంక్ ఉన్నారు. డిగ్రీ పట్టా సాధించారు. ఐటీఐ కూడా అభ్యసించారు. 2003లో పార్టీ మండల యూత్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2014లో వార్డు మెంబర్‌గా సేవలందించారు. 2015, జనవరి నుంచి 2016 జనవరి వరకు సెస్ డైరెక్టర్ నామినేటెడ్ పదవిలో కొనసాగారు. 2016లో సెస్ డైరెక్టర్‌గా మొదటిసారి ఎన్నికయ్యారు. 2022లో ఒక నెల రోజుల పాటు సెస్ డైరెక్టర్ నామినేటెడ్ పోస్టులో ఉన్నారు. సెస్ డైరెక్టర్‌గా మరోసారి ఎన్నికై, వైస్ చైర్మన్‌గా పదవి దక్కించుకున్నారు.



# నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు - నంబర్ ప్లేటు లేని వాహనాలపై కొరఢా..



కరీంనగర్, డిసెంబర్ 27: రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు-జరిమానాలు విధిస్తున్నామని పెద్దపల్లి ఎస్ఐ రాజేశ్ తెలిపారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అయ్యప్ప టె-ంపుల్ వద్ద ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో నెంబర్ ప్లేట్ సరిగా లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడళ్లతోపాటు శివారులో వాహనాల తనిఖీలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాల, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారిపై, ఇన్సూరెన్స్ లేని వారిపై, నెంబర్ ప్లేట్ నిబంధనల ప్రకారం లేని, వాహనాలపై కేసులు నమోదు చేశారు. వాహనదారులు తప్పనిసరిగా వాహన ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సులు, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి లేని వారికి బండి ఇవ్వడం, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం, నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడంలాంటి వాహనాలపై కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే న్యూ ఇయర్ సందర్భంగా స్పెషల్ డ్రైవర్ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో ఎస్సైలు మౌనిక, సహదేవ్ సింగ్ తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

# పొలం దున్నిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



ఏ రైతు అయినా సరే తన పొలాన్ని చూసిన వెంటనే మురిసిపోతాడు. వ్యవసాయం చేస్తూ నిరంతరం శ్రమిస్తాడు. రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కూడా రైతుగా అవతారమెత్తాడు. తన స్వగ్రామం పర్వతగిరిలోని సొంత పొలంలో పనులు జరుగుతుంటే చూసి, వెంటనే పొలంలోకి వెళ్లాడు? గొర్రు పట్టి దున్నారు ఎర్రబెల్లి దయాకర్ రావు. కూలీలతో కలిసి, వారి పాటలకు గొంతు కలిపి నాట్లు వేశారు దయాకర్ రావు.

దండగ అన్న వ్యవసాయాన్ని సీఎం కేసీఆర్ పండగ చేస్తే?ఆ వ్యవసాయాన్ని మంత్రులు కూడా పొలంలోకి దిగి గొర్రు కొడుతున్నారు. మా నాయకుని ఆశయ సాధనలో అడుగులు వేస్తాం అనడమే కాదు.. నేరుగా వ్యవసాయం చేస్తాం.. రైతు రాజు అయితే.. రాజు కూడా రైతు అనే దానిని రుజువు చేస్తున్నారు.

కూలీలు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, అధికారులు, మంత్రులు కూడా ఇష్టంగా వ్యవసాయం చేయడంతో నేడు తెలంగాణ రాష్ట్రం దేశానికి అన్నపూర్ణగా మారింది. గతంలో నెర్రెలు పారిన పొలాలు.. స్వరాష్ట్రంలో ఇప్పుడు పచ్చని పంట పొలాలతో కళకళ లాడుతున్నాయి. అన్నదాత కళ్లలో ఆనందం కనిపిస్తుంది.

అపర భగీరథుడు కేసీఆర్ ఆలోచనలతో ప్రాజెక్టులు రూపొంది, నీళ్లు పరవళ్ళు తొక్కుతుంటే? చెరువులు కుంటలు, నిండి ఉప్పొంగుతుంటే? మంత్రులు కూడా సొంత పొలాల్లో దిగి వ్యవసాయం చేస్తుంటేఊరు వాడ, చేను చెలక మళ్ళీ ప్రాణం పోసుకుని పరవశిస్తున్నాయి. నా తెలంగాణ కోటి ఎకరాల మాగాణి అన్న నినాదం నిజం అయ్యింది.

# వచ్చే జనవరి 3 న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

మెదక్, డిసెంబర్ 26: (నేటినిజం ప్రతినిధి):2023-జిల్లా స్థాయి యువజనోత్సవాలను ఉదయం 10 గంటలకు స్థానిక టి.యెన్.జి.ఓ. భవన్ ప్రాంగణంలో నిర్వహించనున్నామని జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువజన సర్వీసుల శాఖ ఆదేశాల మేరకు జనవరి 3 న స్త్రీ, పురుషులకు జానపద నృత్యం, జానపద గీతం లలో పోటీలు నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. అయితే బృందంలో స్త్రీ,పురుషులు కలిపి 20 మంది మించరాదని స్పష్టం చేశారు. ఈ పోటీలలో ప్రథమ స్థానం పొందిన బృందం జనవరి 9, 10 తేదీలలో మహబూబ్ నగర్ లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనుటకు అర్హులని అయన తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన బృందం జనవరి 12 నుండి 16 వరకు కర్ణాటక లో జరిగే జాతీయ యువజనోత్సవాలలో పాల్గొనుటకు అవకాశం కల్పించబడుతుం దని నాగరాజ్ పేర్కొన్నారు. అయితే అభ్యర్థులు జిల్లాకు చెందిన వారై 15 నుండి 29 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్, 3 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈ నెల 30 లోగా కలెక్టరేట్ లోని యువజన క్రీడల అధికారి కార్యాలయంలో దరఖాస్తు ఫారం పొంది భర్తీ చేసిన దరఖాస్తులను ఆ రోజు సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలని వివరాలకు 9347344440 లేదా 9494825665 నెంబరుకు సంప్రదించాలని నాగరాజ్ సూచించారు.






# కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ సమకూర్చిన 43.08 కోట్ల రూపాయలతో ప్రాజెక్టు నిర్మాణం



న్యూఢిల్లీ, డిసెంబర్ 27:ప్రాజెక్టులో భాగంగా యాంఫీ థియేటర్ ,విద్యుత్ అలంకరణ, దృశ్య శ్రవణ లైట్ షో, దుస్తులు మార్చుకునే గదులు,పార్కింగ్ సౌకర్యం, పర్యాటకుల సౌకర్య కేంద్రం , మరుగుదొడ్లు, సావనీర్ దుకాణాలు, ఫుడ్ కోర్ట్, ఎటిఎం, బ్యాంకింగ్ సౌకర్యాల కల్పన చేపట్టడం జరిగింది.

అన్ని సౌకర్యాలతో ప్రపంచ స్థాయి పర్యాటక, తీర్థ యాత్ర ప్రాంతంగా శ్రీశైలం ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రాజెక్టు అమలు.

కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకంగా ప్రసాద్( తీర్థయాత్ర పునరుజ్జీవనం మరియు ఆధ్యాత్మిక, వారసత్వ వృద్ధిపై జాతీయ మిషన్) అమలు. ...

ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లాలో ఉన్న శ్రీశైలం దేవస్థానం ఆలయ సముదాయం లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఈ ఈఓజు ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకంగా ప్రసాద్( తీర్థయాత్ర పునరుజ్జీవనం మరియు ఆధ్యాత్మిక, వారసత్వ వృద్ధిపై జాతీయ మిషన్)కింద పర్యాటక మంత్రిత్వ శాఖ సమకూర్చిన నిధులతో ప్రాజెక్టును అమలు చేశారు.

ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్రపతి తో పాటు తెలంగాణ గవర్నర్ డాక్టర్ (శ్రీమతి) తమిళిసై సౌందరరాజన్, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి, కేంద్ర పర్యాటక శాఖ సహాయ మంత్రి శ్రీ శ్రీపాద్ వై.నాయక్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి శ్రీ కొట్టు సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక, యువజన అభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి ఆర్.కే. రోజా, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక,ప్రణాళిక, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్, కేంద్ర పర్యాటక శాఖ కార్యదర్శి శ్రీ అరవింద్ సింగ్ ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీశైలం దేవాలయం అభివృద్ధి కార్యక్రమాలను 43.08 కోట్ల రూపాయల ఖర్చుతో చేపట్టి పూర్తి చేయడం జరిగింది. ప్రాజెక్టు అమలుకు అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సమకూర్చింది. ప్రాజెక్టులో భాగంగా యాంఫీ థియేటర్ ,విద్యుత్ అలంకరణ, దృశ్య శ్రవణ లైట్ షో, దుస్తులు మార్చుకునే గదులు,పార్కింగ్ సౌకర్యం, పర్యాటకుల సౌకర్య కేంద్రం , మరుగుదొడ్లు, సావనీర్ దుకాణాలు, ఫుడ్ కోర్ట్, ఎటిఎం, బ్యాంకింగ్ సౌకర్యాల కల్పన చేపట్టడం జరిగింది. అన్ని సౌకర్యాలతో ప్రపంచ స్థాయి పర్యాటక, తీర్థ యాత్ర ప్రాంతంగా శ్రీశైలం ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రాజెక్టును చేపట్టారు.

తీర్థయాత్ర పునరుజ్జీవనం మరియు ఆధ్యాత్మిక, వారసత్వ వృద్ధిపై జాతీయ మిషన్' (ప్రసాద్ ) పథకం అమలు చేయడానికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సమకూరుస్తోంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో పర్యాటక మంత్రిత్వ శాఖ 2014-15 నుంచి పథకాన్ని అమలు చేస్తోంది. పర్యాటక, వారసత్వ సంపద ప్రాంతాల్లో సమగ్ర మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసి పర్యాటక, తీర్థ యాత్ర రంగంలో ప్రత్యక్షంగా పరోక్షంగా ఎక్కువగా ఉపాధి అవకాశాలు కల్పించి, ఆర్థికాభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో ప్రసాద్ పథకం అమలు జరుగుతోంది.

శివుడు మరియు అతని భార్య పార్వతి కొలువు తీరిన దేవాలయం శ్రీశైలం శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం. భారతదేశంలో శైవమతం మరియు శక్తి నిలయమైన ఏకైక ఆలయంగా శ్రీశైలం ప్రసిద్ధి చెందింది.దేవాలయంలో ప్రధాన దైవం భ్రమరాంబ మల్లికార్జున స్వామి లింగం ఆకారంలో ఇక్కడ దర్శనం ఇస్తారు. సహజ రాతి నిర్మాణాలలో ఉన్న ఈ ప్రదేశం శివుడి 12 జ్యోతిర్లింగాలలో ఒకటి. పార్వతి దేవి యొక్క 18 మహా శక్తి పీఠాలలో ఒకటిగా పరిగణించబడుతుంది. భారతదేశంలో 12 జ్యోతిర్లింగాలు మరియు శక్తి పీఠాలలో ఒకటిగా ఉండటమే కాకుండా, ఈ ఆలయం పాదాల ప్రాంత స్థలాల్లో ఒకటిగా వర్గీకరించబడింది. మల్లికార్జున స్వామి మరియు భ్రమరాంబ దేవి విగ్రహాలు 'స్వయంభు' లేదా స్వీయ-వ్యక్తీకరణగా భావిస్తారు. జ్యోతిర్లింగం , మహాశక్తి పీఠం ఒకే చోట ఉండడం శ్రీశైలం ప్రత్యేకత.

# 637 గ్రాముల బంగారు, 4.982 కేజీల వెండి స్వాధీనం.. ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి



తిరుపతి, డిసెంబర్ 27:తిరుపతి జిల్లా పరిధిలోని వెంకటగిరి పట్టణంలో సంచలనం సృష్టించిన నగలు దుకాణం దొంగతనం కేసును ఛేదించడం జరిగిందని ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ? చెడు వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్న యువకుడు బాలయ పల్లి మండలం లోని అలిమిలి గ్రామంకు వెళ్లే దారి లో ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద నూకతోటి వెంకటయ్య ఆటోలో వెళుతుండగా అతన్ని పట్టుకుని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. ఇతను బాలయపల్లి మండలం జయంపు గ్రామం హరిజన వాడకి చెందిన పెంచలయ్య కుమారుడు నూగుతోటి వెంకటయ్య (22) అని వివరించారు. ఇతను వెంకటగిరి పట్టణంలోని ఆర్. వి. ఎం. స్కూలుకి ఎదురుగా రాజా వీధికి సమీపంలో ఉన్న ఎల్వి నాయుడు పాన్ బ్రోకర్, షాపు నగలు దుకాణంలో ఈనెల తొమ్మిదో తేదీ అర్ధరాత్రి వేణుకు వైపు గోడకు కన్నం వేసి అందులో ఉన్న 600 గ్రాముల బంగారు నగలు తోపాటు ఐదు కేజీల వెండి వస్తువులు, రూ.50 వేల నగదును దొంగలించడం జరిగిందన్నారు.

అలాగే గూడూరు పట్టణంలోని వెంకటగిరి రోడ్డుకు సమీపంలో సుప్రజా స్టిల్ అంగడికి కన్నం వేసి గల్ల పెట్ లో ఉన్నరూ.3000ల నగదు, ముత్యాలపేటలోని గాంధీ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందు బిస్మిల్లా రైస్ షాప్ నందు గల్లపెట్టెలో ఉన్నరూ.15000ల నగదు దొంగతనం చేశారన్నారు. అలాగే ఈ దొంగతనాలకు సంబంధించి 637.135 గ్రాముల బంగారు నగదు విలువ 28,67,107 రూపాయలని తెలిపారు. 4,982 కేజీల వెండి వస్తువులు, నగదు 13000తోపాటు ఒక ఆటో నేరానికి ఉపయోగించిన ఇనుప గుణం మును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ దొంగతనాలను చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుని దొంగతనం చేసినటువంటి వ్యక్తిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో క్రైమ్ అదన పు ఎస్పి విమల కుమారి, గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి, వెంకట గిరి సీఐ రామకృష్ణ, ఎస్ఐ జిలాని భాష, ఐడి పార్టీ, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డు ప్రకటించారు.

# అర్జెంటీనా, ఆస్ట్రేలియా, చిలీ నుంచి వ్యూహాత్మక ఖనిజాలను సేకరించేందుకు ప్రయత్నాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:లిథియం వెలికితీత కోసం ప్రాజెక్టులను ఏర్పాటు లక్ష్యంతో, గుర్తించిన రెండు ప్రాంతా ల్లో తవ్వకాలు జరపడం కోసం అర్జెంటీనాకు చెందిన కేమైన్ సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకోవడానికి గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఖనిజ్ బిదేశ్ ఇండియా లిమిటెడ్ (కాబిల్) ఇటీవల ఆసక్తిని వ్యక్తం చేసింది. నిర్ణీత కాల పరిమితిలో ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం. అర్జెంటీనాలో లిథియం, ఇతర ఖనిజాలను అన్వేషించడానికి అర్జెంటీనాకు చెందిన ప్రభుత్వ సంస్థలు జేఈఎంఎస్ఈ, కేమైన్, వైపీఎఫ్‌తో 2020 జులై-సెప్టెంబర్‌లో కాబిల్ మూడు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది.

ఈ సంవత్సరం అక్టోబర్‌లో, అర్జెంటీనాలోని కాటమార్కాలో ఉన్న లా అగ్వాడా, ఎల్ ఇండియోలోని రెండు లిథియం ప్రాజెక్టులకు సంబంధించిన సమాచారాన్ని బ్యూనస్ ఎయిర్స్‌లోని భారత రాయబార కార్యాలయం ద్వారా కేమైన్ పంపింది. చిలీలోనూ ఉమ్మడి లిథియం మైనింగ్ ప్రాజెక్టులు చేపట్టేందుకు కాబిల్ ప్రయత్నాలు చేస్తోంది.

ఆస్ట్రేలియా పరిశ్రమలు, విజ్ఞానం ఉ వనరుల మంత్రిత్వ శాఖకు చెందిన క్రిటికల్ మినరల్ ఆఫీస్‌తో (సీఎంవో) వివరణాత్మక సహకార విధివిధానాలతో కూడిన అవగాహన ఒప్పందం (ఎంవోయూ) మీద 2022 మార్చిలో కాబిల్ సంతకం చేసింది.

ఆస్ట్రేలియాకు చెందిన లి ఉ కో మినరల్ అసెట్స్‌లో ఉమ్మడి పెట్టుబడుల కోసం ఈ ఒప్పందం జరిగింది.

ఖనిజ్ బిదేశ్ ఇండియా లిమిటెడ్ (కాబిల్) పేరిట నాల్కో, హెచ్‌సీఎల్, ఎంఈసీఎల్ కలిసి 2019లో ఒక ఉమ్మడి ప్రాజెక్టును ఏర్పాటు చేశాయి. విదేశాల్లో లిథియం, కోబాల్ట్ వంటి వ్యూహాత్మక ఖనిజాలను తవ్వి, సేకరించడం ఈ ప్రాజెక్ట్ ఉద్దేశం.

# మహా కుంభాభిషేకాన్ని విజయవంతం చేయాలి: మంత్రి ఎర్రబెల్లి



వరంగల్, డిసెంబర్ 26: జనవరి 26వ తేదీ నుంచి వరంగల్ పరిధిలోని పర్వతగిరి పర్వతాల గుట్ట శివాలయంలో జరిగే మహా కుంభాభిషేకం లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు.

మంగళవారం శివాలయ పునః ప్రతిష్ట ఏర్పాట్లను, భక్తుల వసతులను బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , ప్రముఖ వాస్తు నిపుణులు నూకల నరేశ్‌రెడ్డి తో కలిసి పరిశీలించారు. పవిత్ర కార్యక్రమంలో జనగాం, వరంగల్, హనుమకొండ జిల్లాలు పాలకుర్తి, వర్ధన్నపేట నియోజకవర్గాల ప్రజలు భారీ సంఖ్యలో రానున్న నేపథ్యంలో వసతులలో ఎలాంటి లోపం లేకుండా చూడాలన్నారు. భక్తులు తమ వెంట శివునికి అభిషేకం చేసే పూజ సామాగ్రితో ఆలయానికి రావాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని పేర్కొన్నారు.

రోడ్డు, తాగునీరు, విద్యుత్, పోలీసు శాఖల సమన్వయంతో కార్యక్రమం విజయవంతానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

ఈ సందర్భంగా కుంభాభిషేక కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ఉన్నారు.

# మాజీ భార్యకు హెచ్ఐవీ పాజిటివ్ రక్తం ఎక్కించిన భర్త

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:ఓ భర్త దారుణానికి పాల్పడ్డాడు. విడాకులు ఇచ్చిందనే కోపంతో మాజీ భార్యకు హెచ్ఐవీ పాజిటివ్ రక్తాన్ని ఎక్కించాడు. ఈ ఘటన గుజరాత్‌లోని సూరత్‌లో వెలుగు చూసింది.

వివరాల్లోకి వెళ్తే.. సూరత్‌కు చెందిన శంకర్ కాంబ్లేకు తన భార్య రెండు నెలల క్రితం విడాకులు ఇచ్చింది. అయితే తిరిగి ఇంటికి రావాలని భార్యను కోరాడు. కానీ భార్య అందుకు తిరస్కరించింది. దీంతో కోపం తెచ్చుకున్న కాంబ్లే.. తన మాజీ భార్యను నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. ఆ తర్వాత హెచ్ఐవీ పాజిటివ్ రక్తాన్ని ఎక్కించాడు. కాసేపటికే ఆమె స్పృహ తప్పి పడిపోయింది. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాంబ్లేను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని హెచ్ఐవీ వార్డుకు వెళ్లి.. ఓ పాజిటివ్ రోగి నుంచి రక్తాన్ని సేకరించినట్లు నిందితుడు తెలిపాడు. రక్త పరీక్షలకు అని చెప్పి రక్తాన్ని సేకరించానని పేర్కొన్నాడు.

# కొత్త రాష్ట్రమైనా తెలంగాణ అద్భుతాలు చేస్తోంది : పంజాబ్ స్పీకర్

హైదరాబాద్, డిసెంబర్ 27: తెలంగాణ రాష్ట్ర శాసనసభను పంజాబ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ సర్దార్ కుల్తార్ సింగ్ సంధ్వాన్ మంగళవారం సందర్శించారు. శాసనసభ ప్రాంగణానికి చేరుకున్న కుల్తార్ సింగ్‌కు రాష్ట్ర శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శాసనసభ నిర్వహణ, పనితీరుని కుల్తార్ సింగ్‌కు వివరించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆయనకి వివరించారు.

తెలంగాణ రాష్ట్రం కొత్తగా ఏర్పడినప్పటికీ అద్భుతాలు చేస్తున్నదని, దేశ స్థాయిలో పేరు వచ్చిందని పంజాబ్ స్పీకర్ కుల్తార్ సింగ్ ప్రశంసించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర శాసనసభ తరుపున కుల్తార్ సింగ్‌ని శాలువాతో సత్కరించారు. కుల్తార్ సింగ్‌తోపాటు ఆ రాష్ట్ర శాసనసభ్యుడు కల్వంత్ సింగ్ పండోరి, మాజీ శాసనసభ్యుడు అమర్ జీత్ సింగ్ ఉన్నారు.

# పోలీసు ఉద్యోగాలు.. ఫిజికల్ ఈవెంట్స్ నుంచి గర్భిణులకు మినహాయింపు



హైదరాబాద్, డిసెంబర్ 27: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎస్ఐ, పోలీసు కానిస్టేబుల్ పోస్టులకు ఫిజికల్ ఈవెంట్స్ ప్రక్రియ కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఫిజికల్ ఈవెంట్స్ నుంచి గర్భిణులకు మినహాయింపు ఇచ్చారు.

ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన వారిలో పలువురు మహిళలు గర్భిణులుగా ఉండటంతో ఫిజికల్ ఈవెంట్స్‌కు హాజరు కాలేకపోతున్నారు. అలాంటి వారిని దృష్టిలో ఉంచుకుని, ఫిజికల్ ఈవెంట్స్‌లో పాల్గొనకుండానే మెయిన్స్ రాసేలా వెసులుబాటు కల్పించారు. మెయిన్స్‌లో ఒక వేళ పాసైతే.. నెల రోజుల్లోపు ఫిజికల్ ఈవెంట్స్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. అధికారుల నియమావళిని అంగీకరిస్తూ గర్భిణులు లేఖ రాసివ్వాలని నిబంధన విధించారు.

# దళితులు అభివృద్ధి చెందాలనే 'దళితబంధు'

హైదరాబాద్, డిసెంబర్ 27: దళితులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు దళితబంధు పథకాన్ని ప్రారంభించారని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద రాంగోపాల్‌పేట్ డివిజన్ విక్టోరియాగంజ్‌కు చెందిన చంద్రశేఖర్‌రావుకు దళితబంధు క్రింద మంజూరైన కారును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ?ఆర్థికంగా ఎంతో వెనకబడిన దళితులు ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఆలోచనతో దేశంలో ఎక్కడా లేని విధంగా దళితబంధు పథకం ప్రవేశపెట్టి రూ. 10లక్షలు ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు తెలిపారు. దశల వారీగా రాష్ట్రంలోని దళితులందరికి ఈ పథకం కింద ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం అందించే ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్‌పేట్ మాజీ కార్పొరేటర్ అరుణ్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, అర్జున్, లావణ్య, శివకుమార్, రాజు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

**సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటా..**

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో మంత్రిని అమీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ శేషుకుమారి ఆధ్వర్యంలో ప్రశాంత్ కాలనీ, ఏడబ్ల్యూస్, ఎస్ఆర్‌టీ కాలనీ వాసులు కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను విన్నవించారు. ఇప్పటికే రోడ్లు, డ్రైనేజీ, వాటర్‌లైన్ వంటి అనేక అభివృద్ధి పనులు జరిగినట్లు మంత్రి వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే వాటిని కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తమ కాలనీలో సీసీ కెమరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి కమ్యూనిటీ ప్రోగ్రాం కింద కాలనీ వాసుల నిధులతోనూ సీసీ కెమరాలను ఏర్పాటు చేసుకోవాలని ఒకవేళ ఏమైనా నిధులు అదనంగా అవసరమైతే తన నియోజకవర్గ అభివృద్ధి నిధులనుంచి కేటాయించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు, కాలనీ వాసులు శివరాజు, శ్రీకాంత్, రాంరెడ్డి, జగదాంబ, నర్సింహ, బలరాం యశ్వంత్, రాజు, శ్రీను, రాధ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



# జహీరాబాద్ నియోజికవర్గంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి హరీష్ రావు



సంగారెడ్డి డిసెంబర్ 26 (నేటి నిజం ప్రతినిధి) జహీరాబాద్ నియోజకవర్గం లో రూ.97 కోట్లతో 10 ఆర్ అండ్ బి,మరియు 45 పంచాయతీరాజ్ రహదారుల ప్రత్యేక మరమ్మత్తులకు మంత్రి హరీష్ రావు మంగళవారం శంకుస్థాపన చేశారు.

జహీరాబాద్ పట్టణంలో రూ. 10 కోట్లతో నిర్మించిన సమీకృత వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ ను మంత్రి ప్రారంభించారు. పట్టణంలో మినీ హజ్ హౌస్ నిర్మాణానికి,హోతి (కె) గ్రామంలో షాధిఖాన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

పద్మశాలి సంఘం,ముదిరాజ్, ఆరె కటిక, ఆర్య వైశ్య,నాయి బ్రాహ్మణ,పూసల, రజక,స్వర్ణ కారుల,కురుమ యాదవ,అంబేడ్కర్,బాబు జగ్జీవన్ రామ్,హరిజన ,బంజారా సంఘం భవనాలకు సంబంధించి మంజూరీ ఉత్తర్వులను ఆయా కుల పెద్దలకు అందించారు.

జహీరాబాద్ పట్టణం రహమత్ నగర్ లో రూ.19.25 కోట్లతో నిర్మించిన 312 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంత్రి ప్రారంభించారు.13 బ్లాక్ లలో బ్లాక్ కు 24 ఇండ్లను నిర్మించారు.

లబ్ధిదారులకు ఇంటి సాంక్షన్ ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. లబ్ధిదారుల తో గృహ ప్రవేశాలు చేయించి, స్వీట్స్ తినిపించారు.

మెప్మా ఆధ్వర్యంలో 150 స్వయం సహాయక సంఘాలకు రూ.15.82 కోట్ల చెక్కును మంత్రి అందజేశారు.

# ఎలక్ట్రిక్ లూనా వస్తోంది .. త్వరలో మార్కెట్లో విడుదల చేయనున్న కైనెటిక్



న్యూఢిల్లీ, డిసెంబర్ 27:మన దేశ మార్కెట్‌లో గతంలో విశేష ఆదరణ పొందిన లూనా ను తిరిగి తీసుకురానున్నట్లు కైనెటిక్ గ్రూప్ తెలిపింది. పాత లూనాకు బదులు ఈ సారి విద్యుత్ లూనాను తీసుకు వస్తున్నట్లు సోమవారం నాడు ప్రకటించింది. కైనెటిక్ గ్రీన్ ఎనర్జీ అండ్ పవర్ సొల్యూషన్స్ ఇ-లూనాను తీసుకు రానుంది. ఇప్పటికే కైనెటిక్ ఇంజినీరింగ్ లిమిటెడ్ లూనాకు సంబంధిచిన ఛాసిస్, ఇతర విడిభాగాల తయారీని ప్రారంభించింది. కొత్త లూనా కోసం మెయిన్ స్టాండ్, సైడ్ స్టాండ్, స్వింగ్ ఆర్మ్ భాగాలను తయారు చేస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ప్రారంభంలో నెలకు 5 వేల యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యంతో ప్రత్యేక అసెంబ్లి లైన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది.

రానున్న 2-3 సంవత్సరాల్లో లూనా విక్రయాల ద్వారా అదనంగా 30 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపింది. గతంలో రోజుకు 2 వేల లూనాలు విక్రయాలు జరిగేవి. మళ్లిట ఆ స్థాయికి చేరుకుంటామని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అంజిక్య ఫిరోడియా ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ మార్కెట్‌లో లూనా 50 సంవత్సరాల క్రితం తొలిసారి వచ్చింది. అప్పుడు ప్రారంభ ధర 2వేలు. ప్రస్తుతం వస్తున్న ఇ-లూనా విడిభాగాలు, పెయింటింగ్‌తో సహా అన్ని అహ్మదాబాద్ ప్లాంట్‌లోనే తయారు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇతర వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు.

# శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి, డిసెంబర్ 27: తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. వచ్చే నెల 2వ తేదీన వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమంజనం కార్యక్రమాన్ని టీటీడీ శాస్త్రోక్తంగా నిర్వహించింది. ఉదయం 6 నుంచి 11 గంటల వరకూ ఆలయ శుద్ధి కొనసాగింది. ఏడాదిలో నాలుగుసార్లు.. ఉగాది, ఆణివారి ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం రోజున కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది.

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం సందర్భంగా ముందుగా స్వామి వారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచారు. ఆనంద నిలయం నుంచి బంగారు వాకిలి వరకు.. శ్రీవారి ఆలయం లోపల ఉన్న ఉపాలయాలు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి వంటి అన్ని వస్తువులను నీటితో శుభ్రం చేశారు. శుద్ధి కార్యక్రమం పూర్తయిన తర్వాత నామపుకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చకర్పూరం, గంధంపొడి, కుంకుమ, కిచీలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలు కలిపిన పరిమళ ద్రవ్యాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం స్వామి వారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేకపూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు చేపట్టారు. పూజా కార్యక్రమాల తర్వాత ఉదయం 11 గంటలకు స్వామి వారి సర్వదర్శనానికి భక్తులను అనుమతించారు.

ఏడాదిలో నాలుగుసార్లు ఆలయ శుద్ధి చేపట్టడం ఆనవాయితీ వస్తున్నదని టీటీడీ ఈఓ అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. తిరుపతిలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 9 కౌంటర్లలో వైకుంఠ ద్వారా దర్శనాలు జారీ చేస్తున్నట్లు చెప్పారు. రోజుకు 50వేల టిక్కెట్ల చొప్పున సర్వదర్శనం టైం స్లాట్ టిక్కెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. 5 లక్షల టిక్కెట్లు పూర్తయ్యే వరకు జారీ కొనసాగుతుందన్నారు.



# హైదరాబాద్‌లోని కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈరోజు (డిసెంబర్ 27, 2022) హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. ప్రాంతీయ స్వాతంత్ర్య సమరయోధుల కృషిని తెలియచేస్తూ, 'హైదరాబాద్ విమోచన ఉద్యమం' పైఅంశంపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను కూడా రాష్ట్రపతి ప్రారంభించారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, ఒక జాతి నిర్మాణానికి విద్య పునాది అని అన్నారు. ప్రతి వ్యక్తి పూర్తి సామర్థ్యాన్ని వెలికి తీసేందుకు కూడా విద్య కీలకం అని అన్నారు.

కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యకలాపాలు 1940 లో ఒక చిన్న పాఠశాలగా ప్రారంభమై నేడు తొమ్మిది వేర్వేరు కళాశాలలు, 11,000 మందికి పైగా విద్యార్థులతో ప్రధాన విద్యా కేంద్రం స్థాయికి అనేక రెట్లు పెరగడం

సంతోషదాయకమని రాష్ట్రపతి పేర్కొన్నారు. జస్టిస్ కేశవరావు కొరాట్కర్ ఆదర్శాలకు ఆయన జ్ఞాపకార్థం ఏర్పాటయిన కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ సాధించిన అభివృద్ధి అసలైన నివాళి అని ఆమె అన్నారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా హైదరాబాద్ విమోచన 75వ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం ఈ ప్రాంత ప్రజలకు, మొత్తం దేశానికి ఎంతో ముఖ్యమైనదని రాష్ట్రపతి పేర్కొన్నారు.

హైదరాబాద్ విముక్తి కోసం పోరాడిన రాంజీ గోండ్, తుర్రేబాజ్ ఖాన్, కొమరం భీమ్, సురవరం ప్రతాప్ రెడ్డి, షోయబుల్లా ఖాన్ లకు ఆమె నివాళులర్పించారు. వారి శౌర్యం, త్యాగం చిరస్మరణీయమని, ఎప్పటికీగౌరవప్రదమని ఆమె అన్నారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ చారిత్రాత్మక మైలురాయిని మనం జరుపుకుంటున్నప్పుడు, మన స్వాతంత్ర్యం అనేది గతపు అణచివేత పాలకుల నుండి విముక్తి మాత్రమే కాదని గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం అని రాష్ట్రపతి అన్నారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ చారిత్రాత్మక మైలురాయిని మనం జరుపుకుంటున్నప్పుడు, మన స్వాతంత్ర్యం అనేది అణచివేత పాలకుల నుండి విముక్తి మాత్రమే కాదని గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం అని , ఈ రోజు తీసుకున్న చక్కటి ఆలోచనాత్మక చర్యల ద్వారా ఉజ్వల భవిష్యత్తును నిర్ధారించడం కూడా నని అన్నారు.

మనం భవిష్యత్తులోకి వెళుతున్నప్పుడు, మన పూర్వీకులు వేసిన పునాదులపై మన దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకువెళ్లేలా చూసుకోవాల్సిన బాధ్యత భారతదేశంలోని యువకులపై ఉంది.

కష్టపడి పనిచేయడం ,మనం చేసే ప్రతిదానిలో శ్రేష్ఠత కోసం కృషి చేయడం. మన సమాజం మెరుగుదలకు తోడ్పడటానికి సిద్ధంగా ఉన్న బాధ్యతాయుతమైన ,నిబద్ధత కలిగిన పౌరులుగా ఉండటం దీని అర్థం. మన రాజ్యాంగం విలువలు,ఆదర్శాలను నిలబెట్టడం ,మరింత సమ్మిళితమైన, సమానమైన సమాజం కోసం పనిచేయడం. వాతావరణ మార్పులపై పోరాడటం భవిష్యత్తు తరాల కోసం భూగోళాన్ని సంరక్షించడం కూడా దీని అర్థం.

చదువు ప్రాముఖ్యతను నొక్కి చెప్పిన రాష్ట్రపతి, చదివే అలవాటు స్వీయ-అభివృద్ధికి అత్యంత ప్రభావవంతమైన మార్గాలలో ఒకటి అని, ఇది విద్యార్థులకు జీవితాంతం బాగా ఉపయోగపడే నైపుణ్యం అని అన్నారు.

ఇది ఇంటర్నెట్ , సోషల్ మీడియా యుగం అని , శ్రద్ధ తగ్గిపోతున్నప్పుడు కమ్యూనికేషన్ పరిమితం అవుతుందని అన్నారు. అవగాహనను మెరుగుపరచడానికి ,దృక్పథాన్ని విస్తరించడానికి ఎక్కువగా చదవాలని ఆమె విద్యార్థులను కోరారు.

# జూలై-సెప్టెంబర్ 2022 సంబంధించి పబ్లిక్ డెట్ మేనేజ్‌మెంట్ త్రైమాసిక నివేదిక విడుదల

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:కంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని.. ఆర్థిక వ్యవహారాల శాఖ బడ్జెట్ విభాగం జూలై-సెప్టెంబర్ 2022 మధ్య కాలానికి సంబంధించిన పబ్లిక్ డెట్ మేనేజ్‌మెంట్‌పై త్రైమాసిక నివేదికను విడుదల చేసింది. ఏప్రిల్-జూన్ (క్యూ1) 2010-11 నుండి బడ్జెట్ విభాగం పబ్లిక్ డెట్ మేనేజ్‌మెంట్ సెల్ (పీడీఎంసీ) క్రమం తప్పకుండా ఉండే ప్రాతిపదికన రుణ నిర్వహణపై త్రైమాసిక నివేదికను విడుదల చేస్తోంది. ప్రస్తుతం జూలై-సెప్టెంబర్ (క్యూ2 ఈజ23) త్రైమాసికానికి సంబంధించిన నివేదికను వెలువరించింది. 2023 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో కేంద్ర ప్రభుత్వం డేటెడ్ సెక్యూరిటీల ద్వారా రూ.4,06,000 కోట్ల విలువైన మొత్తాన్ని సేకరించింది, రుణం క్యాలెండర్‌లో నోటిఫైడ్ మొత్తం రూ.4,22,000 కోట్లు. రుణ తిరిగి చెల్లింపులు రూ.92,371.15 కోట్లుగా ఉన్నాయి. ప్రాథమిక జారీల సగటు దిగుబడి 2023 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 7.23 శాతం నుండి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 7.33 శాతానికి చేరింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంను (క్యూ2) డేటెడ్ సెక్యూరిటీల జారీ వెయిటెడ్ యావరేజ్ మెచ్యూరిటీ 15.62 సంవత్సరాల దిగువకు చేరింది. అంతకు ముందు త్రైమాసికంలో డేటెడ్ సెక్యూరిటీల జారీ వెయిటెడ్ యావరేజ్ మెచ్యూరిటీ 15.69గా నిలిచింది. జూలై-సెప్టెంబర్ 2022లో కేంద్ర ప్రభుత్వం నగదు నిర్వహణ బిల్లుల ద్వారా ఎలాంటి మొత్తాన్ని సేకరించలేదు. త్రైమాసికంలో ప్రభుత్వ సెక్యూరిటీల కోసం రిజర్వ్ బ్యాంక్ ఓపెన్ మార్కెట్ కార్యకలాపాలను నిర్వహించలేదు. ఈ త్రైమాసికంలో మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ మరియు స్పెషల్ లిక్విడిటీ ఫెసిలిటీతో సహా లిక్విడిటీ అడ్జస్ట్‌మెంట్ ఫెసిలిటీ (ఎల్ఏఎఫ్) కింద భారతీ రిజర్వు బ్యాంక్ నికర రోజువారీ సగటు లిక్విడిటీ శోషణ రూ.1,28,323.37 కోట్లుగా నిలిచింది. అందుబాటులో ఉన్నతాత్కాలిక డేటా ప్రకారం ప్రభుత్వం యొక్క మొత్తం స్థూల బాధ్యతలు ('పబ్లిక్ ఖాతా' కింద బాధ్యతలతో సహా) జూన్ 2022 చివరి నాటికి రూ.1,45,72,956 కోట్ల నుండి 2022 సెప్టెంబర్ చివరి నాటికి రూ.1,47,19,572.2 కోట్లకు పెరిగాయి. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండో త్రైమాసికంలో 1.0 శాతం పెరుగుదలను సూచిస్తుంది. జూన్ 2022 చివరి నాటికి 88.3 శాతంగా ఉన్న స్థూల బాధ్యతలలో పబ్లిక్ రుణం సెప్టెంబర్ 2022 చివరి నాటికి 89.1 శాతానికి చేరింది.

ఇందులో దాదాపు 29.6 శాతం గడువు తేదీ ఉన్న సెక్యూరిటీలు 5 సంవత్సరాల కంటే తక్కువ కాల వ్యవధిని కలిగి ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో ఎక్కువ కాల వ్యవధి సెక్యూరిటీల కోసం మెరుగ్గా ఉండి సరళంగా ఉన్నప్పటికీ, సమీప-కాల ద్రవ్యోల్బణం మరియు లిక్విడిటీ ఆందోళనల కారణంగా సెకండరీ మార్కెట్లో ప్రభుత్వ సెక్యూరిటీలపై స్వల్పకాలిక వక్రతను తీసుకున్నాయి. ఎంపీసీ ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాలనే ఉద్దేశ్యంతో 2023 ఆర్థిక సంవత్సరం క్యూ2లో పాలసీ రెపో రేటును 100 బీపీఎస్, అంటే 4.90% నుండి 5.90% వరకు పెంచాలని నిర్ణయించింది. సెకండరీ మార్కెట్ త్రైమాసిక ట్రేడింగ్ కార్యకలాపాలు 7-10 సంవత్సరాల మెచ్యూరిటీ బకెట్‌లో కేంద్రీకృతమై ఉన్నాయి. ప్రధానంగా 10 సంవత్సరాల బెంచ్‌మార్క్ సెక్యూరిటీలో ఎక్కువ ట్రేడింగ్ గమనించబడింది. ఈ త్రైమాసికంలో సెకండరీ మార్కెట్‌లో ప్రైవేట్ రంగ బ్యాంకులే ఆధిపత్య ట్రేడింగ్ సెగ్మెంట్‌గా అవతరించాయి. నికర ప్రాతిపదికన, విదేశీ బ్యాంకులు మరియు ప్రైమరీ డీలర్లు నికర అమ్మకందారులుగా నిలిచారు, ప్రభుత్వ రంగ బ్యాంకులు, సహకార బ్యాంకులు, ఎఫ్ఐలు, బీమా కంపెనీలు, మ్యూచువల్ ఫండ్‌లు, ప్రైవేట్ రంగ బ్యాంకులు మరియు 'ఇతరులు' సెకండరీ మార్కెట్‌లో నికర కొనుగోలుదారులుగా ఉన్నారు. జూన్ 2022న వాణిజ్య బ్యాంకుల వాటా 38.04 శాతం నుండి 2022 సెప్టెంబర్ చివరి నాటికి 38.3 శాతంగా నిలిచిందని కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీల యాజమాన్య విధానం సూచిస్తుంది.

# దేశంలో అందరికీ సమానహక్కులు..సమాన గౌరవం రావాలి : మంత్రి నిరంజన్ రెడ్డి



వనపర్తి, డిసెంబర్ 27: పాశ్చాత్య దేశాల్లో ఉన్నట్లు అందరికీ సమానహక్కులు, సమాన గౌరవం మన దేశంలోనూ రావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా నిర్వహించిన జాతీయ గణిత దినోత్సవం గణిత సంబరాలకు హాజరయ్యారు.మంత్రి మాట్లాడుతూ ' సమాజంలో సులభంగా పనిచేసి సంపాదించే వారి పెత్తనం పెరిగింది . అది పోయి కష్టంచేసి సంపాదించే వారి మాట చెల్లుబాటుకావాలి. ఆ పరిస్థితి రావాలి. శ్రమను సమానంగా గౌరవించే పరిస్థితి లేకపోవడంతో పాటు, లింగభేదాలతో మహిళలను చిన్నచూపు చూసే దుస్థితి ఉండడం దురదృష్టకరం' మని పేర్కొన్నారు. అందరూ పనిచేయడాన్ని గౌరవంగా భావించాలని సూచించారు. దానిని ఇప్పటి నుంచే అందరూ అలవాటు చేసుకోవాలని,పని విలువ తెలిసినప్పుడే మనుషుల విలువ తెలుస్తుందని సూచించారు.

ప్రతి విద్యార్థి రోజు వారి ఇంటిపనులే కాకుండా వారంతంలో ఇతర పనులు చేయాలని వెల్లడించారు. కష్టం చేయడం ద్వారా సాధించిన ఆదాయం ఎంతో సంతృప్తినిస్తుందని అన్నారు.గతంలో ఆడబిడ్డలను ఉన్నత చదువులకు దూరంగా ఉంచేదని నేడు సమాజంలో ఆడబిడ్డలకు ప్రాతినిధ్యం పెరిగిందని తెలిపారు.ఇతర గ్రామాల నుంచి చదువుకోవడానికి వస్తున్న ఘణపురం ఉన్నత పాఠశాల బాలికలకు సైకిళ్లు అందిస్తానని మంత్రి తెలిపారు.

# సంక్రాంతి ప్రయాణికులకు శుభవార్త.. టీఎస్ఆర్టీసీలో 10శాతం రాయితీ

హైదరాబాద్, డిసెంబర్ 27: సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు టీఎస్ ఆర్టీసీ శుభవార్త చెప్పింది. రానుపోనూ ఒకేసారి టికెట్లు బుకింగ్ చేసుకుంటే తిరుగు ప్రయాణంపై 10శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ప్రకటించింది. డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని, గరుడ ప్లస్ బస్సుల్లో అడ్వాన్స్ రిజర్వేషన్ బుకింగ్‌కు ఈ రాయితీ వర్తిస్తుందని పేర్కొంది. వచ్చే ఏడాది జనవరి 31 వరకు ఈ రాయితీ అమల్లో ఉం టుందని స్పష్టం చేసింది.సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రయాణికులకు ఆర్థిక భారం తగ్గించేందుకు 10శాతం రాయితీ కల్పించాలని నిర్ణయించినట్లు సంస్థ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్, ఎండీ సజ్జన్నార్ తెలిపారు. ఈ రాయితీ సదుపాయాన్ని ప్రజలంతా ఉపయోగించుకోవాలనీ, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. రిజర్వేషన్ కోసం ఆర్టీసీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని విజ్ఞప్తి చేశారు.

# కుట్టు మిషన్ లు, దుప్పట్లు పంపిణి చేసిన మంత్రి



ఖమ్మం, డిసెంబర్ 27: (నేటినిజం ప్రతినిధి): సత్య మార్గం సొసైటీ సర్వీసెస్ సొసైటీ అధ్వర్యంలో మహిళలకు ఉచితంగా టైలరింగ్ లో శిక్షణ ఇచ్చి వారికి తానా తరుపున సామినేని ఫౌండేషన్ చైర్మన్ సామినేని రవి సమకూర్చిన 33 కుట్టు మిషన్ లను మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చేతుల మీదగా ఆయా కుట్టు మిషన్ లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్, కార్పొరేటర్ కర్నాటి కృష్ణా, మాదురి ప్రసాద్, ఆళ్ల నిరిషా రెడ్డి, దాదే అమృతమ్మ, శ్రీలక్ష్మి, తానా ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ వెంకటరమణ, స్థానిక సమన్వయకర్త బండి నాగేశ్వరరావు, నాయకులు మెహబూబ్ అలీ, అన్నం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# తుది పరిక్షలకు అర్హత సాధించిన 595 మంది అభ్యర్థులు



ఖమ్మం, డిసెంబర్ 27: (నేటినిజం ప్రతినిధి): పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో స్టైండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్స్, కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా మంగళవారం జరిగిన దేహదారుఢ్య పరీక్షలకు 1113 మంది హజరైయ్యారని పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ తెలిపారు. ఇందులో595 మంది అభ్యర్థులు తుది పరిక్షలకు అర్హత సాధించారని తెలిపారు. మంగళవారం మొత్తం 1305 మంది అభ్యర్థులు హాజరుకావాల్సివుండగా 1113 మంది హజరై ఈవెంట్లలో పాల్గొన్నారని తెలిపారు.

# బూస్టర్ డోస్‌గా అందుబాటులోకి నాసల్ వ్యాక్సిన్..ధర ఎంతంటే!

న్యూఢిల్లీ, డిసెంబర్ 27: కొవిడ్-19 నియంత్రణకు భారత్ బయోటెక్ అభివృద్ధి చేసిన ముక్కుద్వారా అందించే నాసల్ వ్యాక్సిన్ ఇన్కోవాక్ అత్యవసర వినియోగానికి డీసీజీఐ గత వారం ఆమోదం తెలిపింది. ఈ వ్యాక్సిన్‌ను ప్రైవేట్ ఆస్పత్రులకు రూ. 800కు విక్రయించనుండగా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ . 325 చెల్లించి ఇన్కోవాక్‌ను సేకరిస్తాయి.

ఇన్కోవాక్ నాసల్ వ్యాక్సిన్ కొవిన్ యాప్‌లో ఉండగా జనవరి నాలుగో వారం నుంచి అందుబాటులోకి రానుంది. 18 ఏండ్లు పైబడిన వారికి బూస్టర్ డోస్‌గా ఈ నాసల్ వ్యాక్సిన్‌ను ఇస్తారు. వ్యాక్సిన్ అభివృద్ధి రంగంలో భారత్ పరిశోధన, అభివృద్ధికి ఇంట్రానాసల్ వ్యాక్సిన్ ఆవిష్కరణ మరో ఉదాహరణని ఇమ్యూనైజేషన్‌పై ఏర్పాటైన జాతీయ సాంకేతిక సలహా మండలి (ఎన్‌టాగి) చీఫ్ డాక్టర్ ఎన్‌కే అరోరా పేర్కొన్నారు. దీన్ని సులభంగా వాడే వెసులుబాటుతో పాటు ఈ వ్యాక్సిన్ శ్వాస నాళాల నుంచి శ్వాసకోశ వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించకుండా రోగనిరోధక వ్యవస్థను పెంచుతుందని వెల్లడించారు.

ఇక ఈ వ్యాక్సిన్‌పై మూడు దశల క్లినికల్ ట్రయల్స్‌ను విజయవంతంగా చేపట్టామని ఇన్కోవాక్‌ను అభివృద్ధి చేసిన హైదరాబాద్‌కు చెందిన భారత్ బయోటెక్ ఓ ప్రకటనలో తెలిపింది.మరోవైపు కొవిడ్-19 కేసులు చైనాలో అత్యంత వేగంగా ప్రబలడం, దారుణ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురైనా దీటుగా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా పలు ఆస్పత్రుల్లో మాక్ డ్రిల్స్ నిర్వహిస్తోంది.



# టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) యూనియన్ బ్యాగుల పంపిణీ



ఖమ్మం, డిసెంబర్ 27: (నేటినిజం ప్రతినిధి): టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్)యూనియన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా మహాసభను పురస్కరించుకొని ఖమ్మం డివిజన్ జర్నలిస్టులకు మంగళవారం ఖమ్మం నగరంలో యూనియన్ బ్యాగులను యూనియన్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు బాలబత్తుల రాఘవ, అమరవరపు కోటేశ్వరావు, ప్రైస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుద్దేటి రమేష్ బాబు, షేక్ జానిపాషా, కోశాధికారి కొరకొప్పుల రాంబాబు, సహాయ కార్యదర్శి బిక్కి గోపి, జిల్లా నాయకులు మహిళా ప్రతినిధి వంగూరి ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ బయల్దేరిన సీఎం జగన్



అమరావతి: డిసెంబర్ 27:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఢిల్లీకి బయల్దేరారు. రేపు ప్రధాని నరేంద్ర మోడీతో సీఎం జగన్ భేటీ కానున్నారు. కాగా ఇప్పటికే పలుసార్లు ప్రధానితో భేటీ అయిన జగన్ ఈసారి భేటీపై ప్రాధాన్యత చోటు చేసుకుంది. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలతో పాటు ఇతర రాజకీయ అంశాలపై చర్చ జరగనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలుపుతున్నాయి. ఇక విభజన హామీలు, అలాగే రాష్ట్రానికి సంబందించి కీలక అంశాలను ప్రస్తావించే అవకాశముంది. ఇక రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిణామాల దృష్ట్యా సీఎం జగన్ ఢిల్లీ పర్యటన అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్రమంత్రులతో సీఎం జగన్ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# లాసెట్ అడ్మిషన్ షెడ్యూల్ విడుదల

అమరావతి: డిసెంబర్ 27: లాసెట్ 2022 అడ్మిషన్ షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మంగళవారం విడుదల చేసింది. ఈనెల 28 నుండి 30 తారీఖులలోపు వెబ్ అప్షన్లను నిర్వహిస్తారు. 31వ తేదీన వెబ్ అప్షన్ల మార్పులను కోరతారు. జనవరి రెండో తేదీన సీట్లను కేటాయిస్తారు. మూడు నుండి ఏడు తేదీల్లోపు సీట్లు పొందిన విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. నాలుగో తేదీ నుండి క్లాసులు ప్రారంభమౌతాయి. ఈమేరుకు మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.

# ఓబీసీ రిజర్వేషన్లు లేకుండానే ఎన్నికలకు వెళ్లాలి

## -అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు

అలహాబాద్ డిసెంబర్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఉత్తరప్రదేశ్ పురపాలక సంస్థల ఎన్నికల నిర్వహణ విషయంలో అలహాబాద్ హైకోర్టు మంగళవారంనాడు సంచలన తీర్పు చెప్పింది. ఓబీసీ రిజర్వేషన్లు లేకుండానే ఎన్నికలకు వెళ్లాలంటూ ఆదేశించింది. ఓబీసీ రిజర్వేషన్లపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం డిసెంబర్ 5న జారీ చేసిన ముసాయిదా నోటిఫికేషన్‌ను కోర్టు కొట్టివేసింది.

దీంతో ఓబీసీ రిజర్వేషన్ల ప్రసక్తి లేకుండా యూపీ అర్బన్ బాడీ పోల్స్ నిర్వహణకు మార్గం సుగమమైంది. జస్టిస్ డీకే ఉపాధ్యాయ్, జస్టిస్ సౌరవ్ లావణ్యతో కూడిన ధర్మాసం ఈ ఆదేశాలు ఇచ్చింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం డిసెంబర్ 5న జారీ చేసిన ముసాయిదా నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజనాల వాజ్యం పై కోర్టు ఈ తాజా తీర్పునిచ్చింది.

సుప్రీంకోర్టు నిర్దేశించిన ట్రిపుల్ టెస్ట్ ఫార్ములాను ఓబీసీ రిజర్వేషన్ డ్రాఫ్ట్ పాటించలేదని ఆ పిల్ పేర్కొంది.

కాగా, హైకోర్టు తాజా తీర్పుతో ఓబీసీలకు రిజర్వ్ చేసిన సీట్లను ఇప్పుడు జనరల్ కేటగిరిగా పరిగణిస్తారు. దీంతో ఎవరైనా సరే ఈ సీట్లలో పోటీ చేసే అవకాశం ఉంటుంది. అయితే, ఎస్‌సీ, ఎస్‌టీ సీట్లలో మాత్రం రిజర్వేషన్ యథాప్రకారం కొనసాగుతాయని కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పును ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేయని పక్షంలో జనవరిలో యూపీ అర్బన్ బాడీ పోల్స్ జరుగుతాయి.

### తీర్పును పరిశీలిస్తాం: కేశవ్ ప్రసాద్ మౌర్య

అలహాబాద్ హైకోర్టు తీర్పుపై ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య స్పందిస్తూ, తీర్పును కూలంకషంగా అధ్యయనం చేస్తామని, ఆ తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే, వెనుకబడిన తరగతుల హక్కుల విషయంలో ఎలాంటి రాజీ లేదని అన్నారు.

### బీజేపీపై సమాజ్‌వాదీ పార్టీ విసుర్లు

వెనుకబడిన తరగతుల వారిని బీజేపీ వంచిస్తోందని సమాజ్‌వాదీ పార్టీ ఆక్షేపించింది. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని భూస్థాపితం చేసేందుకు బీజేపీ ఉద్దేశపూర్వకంగానే కుట్రలు సాగిస్తోందని ఆరోపించింది.

# రేపటి నుంచి రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు : హరీశ్‌రావు



సంగారెడ్డి, నవంబర్ 27: (నేటినిజం ప్రతినిధి):రేపటి నుంచి రైతుల ఖాతాల్లో రైతుబంధు సాయాన్ని జమచేసి, అన్నదాతలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఎంపీపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక‌ర్‌రావు, చేనేత కార్పొరేషన్ చైర్మన్ చింత ప్రభాకర్‌తో కలిసి సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం దిగ్వాల్‌లో డబుల్ బెడ్రూం ఇండ్ల ప్రారంభించి, లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌లోని గేటెడ్ కమ్యూనిటీలా డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించినట్లు చెప్పారు. కాంగ్రెస్ హయాంలో ఇలాంటి ఇండ్లను చూశారా అంటూ మంత్రి ప్రశ్నించారు. అప్పట్లో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు రావాలంటే లంచాలు ఇవ్వాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని స్పష్టం చేశారు. త్వరలోనే స్థలాలున్న వారికి ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. రూ. 5.60కోట్ల వ్యయంతో కోహిర్‌లో 88 డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించినట్లు మంత్రి చెప్పారు.

రూ. 150కోట్లతో జహీరాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. మాజీ మంత్రి గీతారెడ్డి హయాంలోనే తాగేందుకు నీళ్లు కూడా లేని పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసూతి ఆపరేషన్లలో సంగారెడ్డి జిల్లా టాప్‌లో నిలిచిందన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. దేశంలో కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా తెలంగాణలో ఉన్నన్ని పథకాలు ఎక్కడా లేవని స్పష్టం చేశారు. కోహీర్‌లో రూ. 50కోట్లతో ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే డయాలసిస్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. త్వరలో సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను ప్రారంభించి గోదావరి జలాలను గోదావరికి తీసుకువస్తామని మంత్రి హామీ ఇచ్చారు. తెంగాణ భూముల రేట్లు పెరగడానికి కారణం ఇక్కడ జరుగుతున్న అభివృద్ధే కారణమని, అన్ని వర్గాల ప్రభుత్వం.. మన కేసీఆర్ ప్రభుత్వమని పేర్కొన్నారు.

# రైతులు ప్రకటనలు చూసి మోసపోకుండా నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలి

## -డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు

ఖమ్మం, డిసెంబర్ 27: (నేటినిజం ప్రతినిధి): ప్రకటనలను చూసి మోసపోకుండా, గతంలో రైతులు వేసిన విత్తనాల్ని పరిశోధన చేసి, వారి అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన విత్తనాలను తీసుకోవాలని, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, మార్కెటింగ్ వైస్ చైర్మన్ గొట్టేముక్కల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు.





మంగళవారం కోటపాడు గ్రామంలో జాల సాయి అనే రైతు సాగు చేసిన అగ్ని వన్ ఎఫ్1 మిర్చి రకం వ్యవసాయ క్షేత్ర ప్రదర్శన దాదాపు 250 మంది రైతులతో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, మార్కెటింగ్ వైస్ చైర్మన్ గొట్టేముక్కల వెంకటేశ్వరరావు, వ్యవసాయ క్షేత్రాన్ని చుట్టూరా కలియతిరిగి, దాని యొక్క ప్రత్యేకతను అనుభవాలను రైతుతో కలిసి మాట్లాడి ఈ రకం సాగు చేయడం వలన రైతులకు మేలు జరుగుతుందని, కాయ పొడవుగా ఉండటం వలన ఎకరానికి కనీసం 30 నుండి 35 క్వింటాలు దిగుబడి వచ్చే అవకాశం ఉందని, నల్లి రోగం, వైరస్, గుబ్బ, ఇగురు, రోగం లాంటివి తట్టుకునే శక్తి ఈ రకం మిర్చికి ఉందని రైతు తెలిపాడని మల్లి బాబు యాదవ్ తెలిపారు. అగ్ని వన్ ఎఫ్1 కంపెనీ ఏఎస్మెచ్ అలీ, కంపెనీ డిస్ట్రిబ్యూటర్స్ శ్రీ హనుమాన్ సీడ్స్ చంద్రశేఖర్, కంపెనీ ప్రతినిధులు వీరన్న, నాగేశ్వరరావు, రైతులు జాల శ్రీను, భాస్కరరావు, లాల్ రెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# సమాజానికి అత్యున్నతమైన సేవలు అందించాలి



ఖమ్మం, డిసెంబర్ 27: (నేటినిజం ప్రతినిధి): సమాజానికి అత్యున్నతమైన సేవలు అందించడంలో పోలీస్ శాఖలోని అన్ని విభాగాల సిబ్బంది నిబద్ధతతో సమిష్టిగా పనిచేస్తున్నారని రాష్ట్ర డీజీపీ యం. మహేందర్ రెడ్డి అన్నారు.

మంగళవారం హైదరాబాదు డీజీపీ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో పోలీస్ ఉన్నతాధికారులు, పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, ఖమ్మం నుండి పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ..నిర్దిష్టమైన ప్రణాళిక, నాణ్యత ప్రమాణాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో రాష్ట్రంలో నేరాల కట్టడిలో అద్భుతమైన పురోగతి సాధించారని అన్నారు. పోలీస్ శాఖ ఆధునీకరణలో భాగంగా పోలీసు సిబ్బంది వ్యక్తిగత వృత్తి పరమైన పని సామర్థ్యాన్ని పెంపొందించి అమలు చేస్తున్న ఫంక్షనల్ వర్టికల్స్ విధానం ద్వారా ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని అన్నారు. పోక్సో, ఎస్సీ ఎస్టీ, ఉమెన్ ఎగినెస్ట్ క్రైమ్, గ్రేవ్ కేసుల్లో నిందుతులను చట్టం ముందు నిలబెట్టి శిక్ష పడేలా చేయడంతో పోలీస్ అధికారులు, సిబ్బంది మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు. ప్రధానంగా పోలీస్ అధికారుల మార్గనిర్దేశంతో నేర పరిశోధన, కేసుల దర్యాప్తు, నిందుతుల అరెస్ట్, చార్జ్ షీట్ సమయలలో ఖచ్చితమైన నాణ్యత ప్రమాణాలు పాటించడం ద్వారానే క్రైమ్ ఎగినెస్ట్ ఉమెన్, పోక్సో, ఎస్సీ ఎస్టీ వంటి కేసులలో పురోగతి సాధించారని అన్నారు. విలువైన సాంకేతిక సౌలభ్యాన్ని సమర్థవంతంగా వినియోగించి సైబర్ సెల్, ఐటి సెల్, టెక్నికల్ బృందాలు వ్యవస్థీకృత నేరాలను నివారించడానికి శాంతి భద్రతల పరిరక్షణలో అంచనాలకు మించిన అద్భుత విజయాలను సాధిస్తున్నారని అన్నారు.

కేసులపై పోలీస్ అధికారులు తరచూ రివ్యూ చేస్తూ.. కోర్టు మానిటరింగ్ సిస్టమ్ ద్వారా పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ తో సమన్వయం చేసుకుంటూ.. సాక్ష్యాలను సకాలంలో న్యాయస్థానంలో ప్రవేశపెట్టి నిందితులకు శిక్ష పడేలా క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టి జిల్లాలో ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తూ..కేసు విచారణలోతీసుకోవలసిన చర్యలపై మార్గనిర్దేశం చేస్తున్నట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ వివరించారు.

సమావేశంలో అడిషనల్ డీసీపీ లాడఆర్డర్ సుభాష్ చంద్ర బోస్, ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఏఎస్పి అంక్షాంశ్ యాదవ్, ఏసీపీ వెంకటేశ్, రహెమాన్, వెంకటస్వామి, రవి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడ ఏరియా దవాఖానలో ఏర్పాటు

నిజామాబాద్, డిసెంబర్ 27: ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ..సర్కారు దవాఖానల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నది. రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నది. ప్రతి ప్రభుత్వ దవాఖానలో అత్యాధునిక పరికరాలను ఏర్పాటు చేస్తోంది. ఇతర ప్రాంతాలకు వెళ్లలేని రోగుల కోసం ప్రత్యేక సదుపాయాలను సమీప దవాఖానల్లోనే కల్పిస్తున్నది. ఇందులో భాగంగా బాన్సువాడ ప్రభుత్వ దవాఖానలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి కృషితో ఈ సెంటర్ ఏర్పాటుకాగా, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇదే మొదటిది కావడం గమనార్హం. 2018 జనవరి 18న ప్రారంభించినప్పటికీ అన్ని సౌకర్యాలతో చికిత్సను అదే సంవత్సరం మార్చి 24 నుంచి ప్రారంభించారు. ఈ కేంద్రంలో ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 140 మంది రోగులు డయాలసిస్ చేయించుకున్నారు. ఇందులో 91 మంది మృతిచెందగా.. ప్రస్తుతం 49 మంది వారికి కేటాయించిన రోజుల్లో డయాలసిస్ చేయించుకుంటున్నారు.

బాన్సువాడ డయాలసిస్ కేంద్రంలో ప్రస్తుతం 5 బెడ్ల తో చికిత్స అందిస్తున్నారు. అత్యవసరాన్ని దృష్టిలో ఉంచుకొని మరో ఐదు బెడ్లు ఏర్పాటు చేస్తామని సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.

### కలుషిత నీటితోనే వ్యాధులు

కలుషిత నీరు తాగడంతోనే కిడ్నీకి సంబంధించిన వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ. దీంతో బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నల్లా ఇవ్వడంతో పాటు ప్రతి రోజు రెండు పూటల అందిస్తున్నాం. బాన్సువాడ డయాలసిస్ కేంద్రంలో





ప్రస్తుతం 5 బెడ్ల తో చికిత్స జరుగుతోంది. అవసరం మేరకు మరో ఐదు బెడ్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

2018లో బాన్సువాడ ఏరియా దవాఖానలో అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి ప్రస్తుత సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి కృషితో ఇక్కడ డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు ఈ కేంద్రంలో 140 మందికి ట్రీట్‌మెంట్ అందించాం. ప్రస్తుతం 49 మంది డయాలసిస్ రోజు వారీగా తీసుకుంటున్నారు.

దవాఖానలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇక్కడే పనిచేస్తున్నాను. ఎంతో మంది కిడ్నీ రోగులకు ఇక్కడ ట్రీట్‌మెంట్ అందించాను. బాన్సువాడ నియోజకవర్గం నుంచే కాకుండా పక్కన ఉన్న నియోజకవర్గాల నుంచి కూడా డయాలసిస్ కోసం వస్తున్నారు.

# బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి

హైదరాబాద్, డిసెంబర్ 27:సమైక్య రాష్ట్రంలో బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను ప్రపంచానికి తెలియకుండా చేశారని, తెలంగాణ ఏర్పడ్డాక ఆ మహనీయుడి స్ఫూర్తితో సీఎం కేసీఆర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని ఎక్సైజ్, క్రీడా శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆయన అడుగుజాడల్లో బీఆర్ఎస్ సర్కార్ పయనిస్తుందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలకేంద్రంలో జై గౌడ్ ఉద్యమ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సర్వాయి పాపన్నగౌడ్ మహారాజ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి మంత్రి ఆవిష్కరించారు.

పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సర్వాయి పాపన్న యావత్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమన్నారు. కులవృత్తుల వారు, రైతులు పన్నులు చెల్లించాలని ఉన్న దుర్మార్గమైన పరిపాలనకు స్వస్తి పలకాలని.. బడుగు, బలహీన వర్గాల ప్రజలను చైతన్యపరిచి సొంతంగా సైన్యం ఏర్పాటు చేసుకున్నట్లు గుర్తు చేశారు. 33 కోటలను జయించి, రాజుల సంపదను కొల్లగొట్టి పేదలకు పంచిన యోధుడు సర్వాయిపాపన్న అని పేర్కొన్నారు.

మాజీ డీజీపీ పేర్వారం రాములు సోదరుడు పేర్వారం జగన్నాథం లండన్ కేంబ్రిడ్జి యూనివర్సిటీలో పాపన్న విగ్రహాన్ని చూసిన తర్వాత 2003లో ఆయనపై ఓ పుస్తకాన్ని ప్రచురించినట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సర్వాయి పాపన్న జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. కులవృత్తులపై ఆధారపడిన వారికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. ఎన్నో ఏండ్లుగా గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం కేసీఆర్ పరిష్కరించారన్నారు. చెట్టు పన్ను రద్దుతోపాటు పదేండ్లకోసారి లైసెన్స్ రెన్యూవల్, నీరా పాలసీతో కల్లు వృత్తిపై ఆధారపడిన వారికి అండగా నిలుస్తున్నామన్నారు. రూ. 20 కోట్లతో హైదరాబాద్ నెక్లెస్ రోడ్డుపై నీరాకేఫ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ. 500 కోట్ల విలువైన భూమిని గౌడ భవన నిర్మాణానికి కేటాయించినట్లు తెలిపారు. త్వరలోనే భవన పనులు ప్రారంభిస్తామన్నారు. కులవృత్తిదారులపై వేధింపులు లేకుండా చేసిన ఘనత బీఆర్ఎస్ సర్కార్‌దేనని వెల్లడించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలను వేధిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

పేద విద్యార్థుల కోసం రాష్ట్రంలో వెయ్యి గురుకులాలు ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల పెన్నిధి సీఎం కేసీఆర్ అని అన్నారు. కొల్లాపూర్‌లో గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం, రూ. 10 లక్షల నిధులు అందించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ మండలి చైర్మన్ స్వామిగౌడ్, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, జై గౌడ్ ఉద్యమం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వట్టికూర రామారావుగౌడ్, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గుండ్రాతి నారాయణగౌడ్, గౌడ సంఘం తాలూకా అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, ప్రతాప్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్లు రాజేందర్‌గౌడ్, బాలరాజుగౌడ్, మహబూబ్‌నగర్ జిల్లా గౌడ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, విగ్రహదాత ప్రసాద్‌గౌడ్, జై గౌడ సంఘం సభ్యులు ఉదయగౌడ్, అశోక్‌గౌడ్, లచ్చాగౌడ్, యుగంధర్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వైకుంఠ ద్వార దర్శనానికి వచ్చే భక్తులు మాస్కులు ధరించాలి : టీటీడీ చైర్మన్

తిరుపతి, డిసెంబర్ 27:వైకుంఠద్వార దర్శనం కోసం తిరుమలకు వచ్చే భక్తులు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి కోరారు. నూతన సంవత్సరం, వైకుంఠద్వార దర్శనాల సందర్భంగా మంగళవారం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కొత్త ఏడాది, వైకుంఠద్వార దర్శనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు. 10 రోజుల పాటు ఉత్తరద్వార దర్శనాలకు ఏర్పాట్లు చేశామని వివరించారు. సర్వదర్శన భక్తులకు తిరుపతిలో తొమ్మిది చోట్ల 92 కౌంటర్లు నెలకొల్పుతున్నామని తెలిపారు.

టోకెన్లు తీసుకుని భక్తులు తిరుమలకు రావాలని సూచించారు. ఉచిత టోకెన్లు ఉన్నవారు కృష్ణతేజ అతిథిగృహం వద్ద రిపోర్టు చేయాలని అన్నారు. రోజుకు రెండువేల చొప్పున శ్రీవాణి ట్రస్ట్ ద్వారా టికెట్లు జారీ చేశామని, గోవిందమాల వేసుకున్న భక్తులూ టోకెన్లు తీసుకురావాలి పేర్కొన్నారు. భక్తులకు శీఘ్ర దర్శనం కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్ వెల్లడించారు.

వైకుంఠ ద్వార దర్శనాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించారు. ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రంగా చేశారు.

ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచారు. శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేకపూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు.

# సాల్వేరు కృష్ణకు వంజరి సమాజ్ భూషణ్ పురస్కార్ ప్రధానం

హైదరాబాద్ డిసెంబర్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అఖిలభారత వంజరి సేవా సంఘం జాతీయ సీనియర్ ఉపాధ్యక్షులు సాల్వేర్ కృష్ణ వంజరి కు నాసిక్ లో జరిగిన జాతీయ వంజరి సాహితీ సమ్మేళనం లో వంజరి సమాజ్ భూషణ్ పురస్కారంతో సన్మానించారు.అఖిలభారత వంజరి సేవా సంఘం కార్యక్రమాలను తెలంగాణలో విస్తరించి వంజరుల ఐక్యతకు కృషి చేస్తున్న సాల్వేర్ కృష్ణనువంజరి సమాజ్ భూషణ్ పురస్కారం ప్రదానం చేశారు.తెలంగాణలో వంజరుల ఐక్యత కోసం ఎంతగానో కృషి చేస్తున్న ఆయనను సన్మానించడం తమకెంతో ఆనందం కలిగిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. వంజరి సమాజ సేవలో ఆయన సేవలు మరింత విస్తరించాలని వక్తలు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో భగవాన్ బాబా ట్రస్ట్ మెంబర్ డాక్టర్ గిత్తె సాహెబ్ అఖిలభారత వంజరి సేవా సంఘం జాతీయ అధ్యక్షులు భవన్ రావు రామచంద్ర కాడే కేకే సనాప్ ప్రవీణ్ అందాలేలతా గూటే ,అలకానంద గూగె ,డాక్టర్ సారంగ ధరాదేసింధుదహిపతే తెలంగాణ ప్రతినిధులు కాలేరు సురేష్ రూపా జ్యోతి ఎదుగని లక్ష్మణ్తదితరులు పాల్గొన్నారు.కాగా తెలంగాణలో వంజరుల ఐక్యత కోసం నిరంతరం కృషి చేస్తున్న సాల్వేర్ కృష్ణకు వంజరి సమాజ్ భూషణ్ పురస్కారం లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణ వంజరి సేవా సంఘం అధ్యక్షుడు ఎదుగని శంకర్ నారాయణ ప్రధాన కార్యదర్శి దాత్రిక ధర్మరాజు ఉపాధ్యక్షుడు పిట్టల అంజయ్య సోషల్ మీడియా కన్వీనర్ కాలేరు వెంకటరమణ ఎల్బీనగర్ వంజర సంఘం అధ్యక్షుడు నవాతే రాజేందర్ అంబర్పేట వంజరి సంఘం అధ్యక్ష కార్యదర్శులు లవంగ ఆంజనేయులు వంజరి నాగరాజు వంజరి సేవా సంఘం ప్రతినిధులు వారే రామకృష్ణ కరిపే రాజ్ కమల్ పాపనక శ్రీనివాస్ ప్రకాష్ కాలేవార్ మాయ శ్రీధర్ తదితరులు అభినందనలు తెలియజేశారు.



